ఈనాడు తూర్పుగోదావరి



కోస్తా రైలు మార్గంపై కోటి ఆశలు

సాకారమైతే సౌలభ్యమిదే..

● విశాఖ-చెన్నై రైలు మార్గంలోని అన్నవరం నుంచి కాకినాడ తీరంలో కొత్తగా నిర్మించబోయే గ్రీన్ ఫీల్డ్ పోర్టు-కాకినాడ పోర్టు-కోటిపల్లి-నరసాపురం-మచిలీపట్నం-రేపల్లె-నిజాంపట్నం పోర్టులను కలుపుతూ బాపట్ల వరకు జాతీయ రహదారి-216కు అనుబంధంగా కోస్తా రైలు మార్గం నిర్మించాలి. -దశాబ్దకాలంగా కొకనడ టౌన్ ప్రయాణికుల సంఘం విన్నపం

● నరసాపురం-మచిలీపట్నం-రేపల్లె-బాపట్ల మధ్య కొత్త రైల్వేలైన్ మంజూరు చేయాలి. ఈ లింక్ను బాపట్ల దగ్గర కోల్కత్తా-చెన్నైలతో అనుసంధానం చేయాలి. -దిల్లీ పర్యటనలో కేంద్ర రైల్వే మంత్రిని కోరిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, కాకినాడ

వ్యవసాయ, పారిశ్రామిక, నౌకా వాణిజ్యం, పెట్రోలియం-గ్యాస్ నిక్షేపాలు, సముద్రనదీ మత్స్య ఉత్పత్తులకు కోస్తా ప్రాంతంలో కొదవే లేదు. సుదీర్ఘ సాగర తీరం.. గోదావరి-కృష్ణా నదీ పరీవాహకం.. ఈ ప్రాంతాన్ని కలుపుతూ కోస్తా రైలు మార్గాన్ని నిర్మిస్తే రాకపోకలకు సౌలభ్యం కలుగుతుంది. పారిశ్రామిక-వాణిజ్య రంగాలకూ ఊతమిచ్చినట్లు అవుతుందన్నది దశాబ్దాలుగా వినిపిస్తున్న వాదన. తాజాగా దిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ రైలు మార్గం మంజూరు చేయాలని కేంద్ర రైల్వే మంత్రిని కలిసి కోరడం.. సానుకూల స్పందన రావడంతో ప్రాజెక్టు సాకారమయ్యే సూచనలు కనిపిస్తున్నాయనే మాట వినిపిస్తోంది.

■ కాకినాడ నగరానికి ప్రధాన రైలు మార్గం అనుసంధానం కాలేదు. దీంతో ఇటు సామర్లకోట రైల్వే స్టేషన్కు.. లేదంటే రాజమహేంద్రవరం వెళ్లాల్సి వస్తోంది. మార్గం సాకారమైతే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

■ చెన్నై-విశాఖ ప్రధాన రైలు మార్గానికి ఇది ప్రత్యామ్నాయ రైలు మార్గంగా మారుతుంది. 50 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల ప్రజలకూ సౌలభ్యంగా ఉంటుంది.

■ గోదావరి, కృష్ణా నదుల మధ్య కోనసీమ, దివిసీమ లాంటి ప్రాంతాలకు రైలు మార్గం ఏర్పాటు ద్వారా సుందర ప్రదేశాలను కలుపుతూ పర్యాటకంగా అభివృద్ధికి వీలుంది.

■ అన్నవరం నుంచి గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు రైలు మార్గం నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది. గతంలోనే కాకినాడ-కోటిపల్లి రైలు మార్గం నిర్మించారు. కోటిపల్లి-నరసాపురం రైలు మార్గం పనులు సాగుతున్నాయి.

■ గ్రీన్ఫీల్డ్ పోర్టు నుంచి కాకినాడ-నరసాపురం నుంచి మచిలీపట్నం-రేపల్లె, నిజాంపట్నం మీదుగా బాపట్ల వరకు 100 కి.మీ పైగా రైలు మార్గం నిర్మిస్తే సరిపోతుంది.

■ కోటిపల్లి-నరసాపురం రైలు మార్గం నిర్మాణంలో భాగంగా గోదావరి ప్రాంతంలోని నదులపై వంతెనల నిర్మాణం సాగుతోంది. మిగిలింది కృష్ణా నదిపై వంతెన నిర్మాణమే. తక్కువ ఖర్చుతో ఈ మార్గం పూర్తిచేయవచ్చు.

ఉమ్మడి గోదావరి-కృష్ణా జిల్లాలకు మేలు

కోస్తా రైలు మార్గం కోసం పదేళ్లకుపైగా పోరాడుతున్నాం. మా డిమాండ్ను సీఎం చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లినందుకు ధన్యవాదాలు. ప్రధాన రైలు మార్గానికి ప్రత్యామ్నాయంగా.. నాలుగు పోర్టులను, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలను కలుపుతూ మార్గం ఏర్పాటైతే ఈ ప్రాంతీయుల రాకపోకలకు సౌలభ్యంతోపాటు.. పారిశ్రామిక, వాణిజ్యరంగాలకూ ఊతమిచ్చినట్లువుతుంది.

- వైడీ రామారావు, దక్షిణ మధ్య రైల్వే జోనల్ వినియోగదారుల సలహా సంఘం సభ్యులు

తీరంలో అలజడి

భారీ వర్ష సూచనతో యంత్రాంగం అప్రమత్తం

రాజమహేంద్రవరం కలెక్టరేట్: తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమయ్యింది. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఆర్డీవోలు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఇతర క్షేత్రస్థాయి అధికారులతో కలెక్టర్ ప్రశాంతి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రానున్న 4, 5 రోజులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులంతా అందుబాటులో ఉండాలన్నారు. కోతలు మొదలై ఇప్పటివరకు 2,555 మెట్రిక్ టన్నుల ధాన్యం ఒబ్బిడి జరిగినందున ఆ ధాన్యం ఓపెన్ మార్కెట్కు వెళ్లిందా లేదా అన్నది నిర్ధారణ చేసుకుని ఆ వివరాలు ఎప్పటికప్పుడు యాప్లో నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



పెరుమాళ్లపురం సముద్ర తీరంలో ఎగసిపడుతున్న అలలు

విద్యుత్తు శాఖ కంట్రోల్ రూమ్ల ఏర్పాటు

దేవీచౌక్: 24 గంటలు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్లు ఏర్పాటుచేసినట్లు ఎస్ఈ కె.తిలక్కుమార్ తెలిపారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం, తీగలు తెగిపడటం, స్తంభాలు ఒరిగిపోవడం లేదా పడిపోవడం, తీగలపై చెట్లు, కొమ్మలు పడిపోవడం గుర్తిస్తే వెంటనే సమాచారం ఇస్తే చర్యలు చేపడతామన్నారు.

రాజమహేంద్రవరం సర్కిల్ **73822 99960, 0883-2463354**
రాజమహేంద్రవరం టౌన్ డివిజన్ **94906 10855**
రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ **94906 10003**
నిడదవోలు డివిజన్ **83329 73595**

ఫుల్ జోష్

413 మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ పూర్తి



దరఖాస్తుదారులు, వారి మద్దతుదారులతో కిటకిటలాడుతున్న ఆనం కళా కేంద్రం ఆవరణ

ఈనాడు, కాకినాడ -న్యూస్టుడే, దానవాయిపేట

ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. కాకినాడ, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద, తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో ఈ ప్రక్రియ సాగింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 413 దుకాణాలకు లాటరీ ప్రక్రియను అధికార యంత్రాంగం పూర్తిచేసింది.

లాటరీ సందర్భంగా ఆయా కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచే సందడి కనిపించింది. ఉదయం 8 గంటలకు ప్రారంభించిన లాటరీ ప్రక్రియ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో మధ్యాహ్నానికే ముగిస్తే.. తూర్పుగోదావరి జిల్లాలో సాయంత్రం వరకు సాగింది. ఎక్కడా ఎలాంటి అనుమానాలు, వివాదాలకు తావివ్వకుండా.. లక్కీడ్రా ప్రక్రియ మొత్తం కలెక్టర్లు వీడియో దృశ్యాలు చిత్రీకరించారు. జిల్లాల వారీగా గెజిట్లో ప్రచురించిన దుకాణాల క్రమ సంఖ్య ప్రకారం లాటరీ తీశారు. అధికారులు ఒకటికి రెండుసార్లు పేర్లు, టోకెన్ నంబర్లు మైక్లో చెబుతూ దరఖాస్తు చేసుకున్న వారి సమక్షంలో డ్రా తీశారు.

ఎంపిక ఇలా..

లక్కీడ్రాలో దుకాణం దక్కించుకున్న విజేతను.. సక్సెస్ఫుల్ క్యాండిడేట్ అని.. ఆ తర్వాత వచ్చిన రెండు టోకెన్లను రిజర్వుడు 1, 2 కింద ఎంపిక చేశారు. లక్కీడ్రాలో విజేత సొమ్ము చెల్లించి, లైసెన్సు పొందకపోతే.. మిగిలిన ఇద్దరికి ప్రాధాన్య క్రమంలో అవకాశం దక్కుతుంది

మహిళల ఆసక్తి

మద్యం దుకాణాలు దక్కించుకోవడానికి పలువురు మహిళలు లాటరీ ప్రక్రియలో పాల్గొన్నారు. వీరి పేరుతో కలిసొస్తుందని పలువురు భార్య, కుమార్తె, ఇతర మహిళా కుటుంబీకుల పేర్లతో దరఖాస్తు చేశారు. రాజమహేంద్రవరంలో 250 మందికిపైగా వనితలు దరఖాస్తు చేయడం గమనార్హం. జిల్లాల వారీగా కాకినాడలో 10, కోనసీమలో 11, తూర్పుగోదావరి జిల్లాలో 12 మద్యం దుకాణాలు మహిళలకు దక్కాయి.

లాటరీ ప్రక్రియ నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రశాంతి. చిత్రంలో జేసీ చిన్నరాముడు, ఎంఆర్వో కృష్ణనాయక్ తదితరులు



జిల్లాలో ఇదీ పరిస్థితి..

రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. 4,384 దరఖాస్తులు అందగా డ్రా ద్వారా 125 దుకాణాలకు లైసెన్సులు ఖరారు చేశారు. కలెక్టర్ పి.ప్రశాంతి లక్కీడ్రా ప్రారంభించారు. జేసీ ఎస్ చిన్నరాయుడు, ఆర్డీవో కృష్ణనాయక్, ఎక్సైజ్ ఈఎస్ సీహెచ్.లావణ్య తదితరులు ప్రక్రియ నిర్వహించారు. ■ జిల్లాలో ఓ మద్యం దుకాణానికి సగటున 30 నుంచి 70 మంది వ్యాపారులు దరఖాస్తులు చేశారు. 10 నుంచి 15 మంది సిండికేటుగా ఏర్పడి వందల సంఖ్యలో దరఖాస్తులు చేసి.. పదుల సంఖ్యలో దుకాణాలు దక్కించుకున్నారు. ■ రాజమహేంద్రవరంలో రెండు సిండికేట్ వర్గాల హవా కొనసాగించారు. ఓ వర్గం నగరంలో, మరోవర్గం గ్రామీణ పరిధిలోని 39 దుకాణాలకు 300కి పైగా దరఖాస్తులు చేసుకున్నాయి. వీరికి లాటరీలో 16 దుకాణాలు మాత్రమే దక్కాయి. ■ అర్బన్లో ఓ దుకాణానికి 27 దరఖాస్తులు అందగా. . అందులో ఓ వర్గానివి 17 ఉన్నాయి. కానీ లాటరీలో ఆ దుకాణం వేరొక సిండికేట్కు దక్కింది.

ఊరూరా ఉత్సవమే..

'పల్లె పండగ' ప్రారంభం



రావిమెట్లలో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి

నిడదవోలు, న్యూస్టుడే: పల్లె పండగకు అడుగుపడింది. అయిదేళ్ల తర్వాత ఊరూరా ఆనందం వెల్లివిరిసింది. కూటమి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా పల్లెపండగ-పంచాయతీ వారోత్సవాలు.. జిల్లావ్యాప్తంగా సోమవారం ప్రారంభమయ్యాయి. గత అయిదేళ్ల వైకాపా పాలనలో గ్రామాలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ విమర్శించారు. నిడదవోలు మండలంలోని పలు గ్రామాల్లో రూ.3 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు చేయించుకున్న తొలి ఎమ్మెల్యేని తానేనని అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ రూ.11 కోట్లు మంజూరు చేశారన్నారు. ఎర్రకాలువ వరదల కారణంగా నష్టపోయిన రైతులకు త్వరలో ఉత్పాదక రాయితీ విడుదలకు కృషి చేస్తానన్నారు. జిల్లావ్యాప్తంగా రూ.83.15 కోట్లతో 938 పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. రావిమెట్ల కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

కార్తికం.. సత్యదేవుడి సన్నిధిలో సన్నద్ధం

అన్నవరం, న్యూస్టుడే: రానున్న కార్తిక మాసంలో భక్తుల రద్దీ నేపథ్యంలో చురుగ్గా ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్, ఇతర విభాగాల అధికారులను ఈవో కె. రామచంద్రమోహన్ ఆదేశించారు. అదనపు వ్రత మండపాలు, క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. వసతి గదుల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. దర్శనాలు, వ్రతాల నిర్వహణ, ట్రాఫిక్, వసతి, భద్రత తదితర అన్ని అంశాలపై చర్చించి ఏర్పాట్లను ఈ నెల 22 నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. తెప్పోత్సవం, గిరిప్రదక్షిణ, పర్వదినాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఈ నెల 19న సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

అప్పు తిరిగి చెల్లించమన్నందుకు దాడి చేశారు

◆ నిందితుడు శ్రీనివాస్పై చర్యలు తీసుకోవాలి : యాంకర్ కావ్యశ్రీ



మాట్లాడుతున్న బాధితురాలు కావ్యశ్రీ

దేవీచౌక్(రాజమహేంద్రవరం): ''రాజమహేంద్రవరానికి చెందిన ఎన్వీ శ్రీనివాస్ తనయుడు అభిలాష్కు మూడేళ్ల క్రితం రూ.3 లక్షలు అప్పు ఇచ్చా. వాటిని తిరిగి ఇవ్వాలంటూ అనేక సార్లు అడిగినా స్పందించలేదు. ఆదివారం వారి ఇంటికి వెళ్లి గట్టిగా అడగడంతో నాపై, నా తండ్రిపై దాడి చేశారు. ఈ విషయాన్ని మాజీ ఎంపీ భరత్రామ్ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. దాడి తర్వాత ప్రకాశంనగర్ పోలీస్టేషన్లో ఫిర్యాదు చేయడానికి వెళితే. . విషయం తెలిసి భరత్రామ్ తిరిగి మాపైనే కేసు పెట్టమనడం దారుణం'' అని యాంకర్ కావ్యశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలో వైకాపా నాయకుడు శ్రీనివాస్ ఆదివారం దాడిచేశారంటూ కావ్యశ్రీ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం రాజమహేంద్రవరంలోని ప్రెస్క్లబ్లో తెలుగు మహిళలతో కలిసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. శ్రీనివాస్ చెప్పే మాటలను రికార్డు చేశామని, ఒక పార్టీ నాయకుడిగా అహంకారంతోనే ఆయన దాడి చేశారని ధ్వజమెత్తారు. అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెదేపా పార్లమెంట్ మహిళా కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, నగర మహిళ కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండిప్రియ మాట్లాడుతూ.. మహిళలపై దాడి చేసే ధైర్యం, పొగరు ఎక్కడ నుంచి వచ్చిందని ప్రశ్నించారు. వైకాపా నాయకులు తాము ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమ నుంచి బయటకు రావాలన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. మహిళపై దాడిచేసిన ఎన్వీ శ్రీనివాస్ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తెలుగు మహిళలంతా ఆమెకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని హోంమంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు.

స్టేషన్ బెయిల్

దానవాయిపేట: దాడి చేసిన ఎన్వీ శ్రీనివాస్పై 354, 373, 506 సెక్షన్ల క్రింద రాజమహేంద్రవరం ప్రకాశంనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం శ్రీనివాస్ను అరెస్టు చేసిన పోలీసులు.. రిమాండ్ నిమిత్తం సాయంత్రం న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. న్యాయమూర్తి స్టేషన్ బెయిల్కు సిఫార్సు చేయడంతో శ్రీనివాస్ను విడుదల చేసినట్లు సీఐ బాజీలాల్ తెలిపారు.

వనితలకు వడ్డీ లేని రుణం!



రూ.50 వేలు రాయితీ, దీర్ఘకాలిక చెల్లింపు



సీతానగరంలో రుణాలపై వివరిస్తున్న ఏపీఎం తదితరులు

సీతానగరం, న్యూస్టుడే: జిల్లాలోని 18 మండలాల్లో 7,697 ఎస్సీ స్వయం సహాయక సంఘాల్లో 75,485 మంది సభ్యులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో చిన్నతరహా పరిశ్రమలపై ఆధారపడి జీవనోపాధులను పెంచే అర్హులకు తొలివిడతగా ప్రాధాన్యం కల్పిస్తున్నారు. స్వయం సహాయక సంఘాల్లోని ఎస్సీ మహిళలకు వడ్డీ లేకుండా రాయితీ రుణాలు అందించాలని సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయంతో లబ్ధిదారుల గుర్తింపు జిల్లాలో శరవేగంగా సాగుతోంది. ఎస్సీ వర్గాల్లోని సభ్యులకు ఇచ్చిన రుణాల్లో రాయితీ ఇవ్వడమే కాకుండా వడ్డీలేకుండా దీర్ఘకాలిక వాయిదాల చెల్లింపులకు గడువు సమయం ఇవ్వడం ఇదే ప్రథమం. దీంతో ఈ రుణాలు పొందేందుకు ఆయా మహిళలు ముందుకొస్తుంటే వారు నిర్వహించే చిన్నతరహా కుటీర పరిశ్రమల నిర్వహణను అధికారులు గుర్తిస్తున్నారు.

రూ.5 లక్షల వరకు అవకాశం

డ్వాక్రా సంఘాల్లోని ఎస్సీ మహిళలకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల రూపాయల వరకు రుణాలు అందించనున్నారు. ఇచ్చిన రుణంలో రూ.50వేలు రాయితీ ఉంది. మిగతా రుణంపై నయాపైసా వడ్డీ ఉండదు. తీసుకున్న రుణాన్ని 24 నెలలు నుంచి 60 నెలల్లోపు కట్టాల్సి ఉంటుంది. చిన్నతరహా కుటీర పరిశ్రమలు, ఇతరత్రా వ్యాపారాలు, సేవారంగంలోని మహిళలకు ప్రాధాన్యం ఉంటుంది. ప్రతి సభ్యురాలు రుణం తీసుకునే వెసులుబాటు ఉంటుంది. జిల్లాలో గోపాలపురం, కొవ్వూరు, రాజానగరం, రాజమహేంద్రవరం గ్రామీణం నియోజకవర్గాల్లో ఎస్సీ స్వయంసహాయ సంఘాల్లో సభ్యులు భారీగా పెరిగారు.

నివేదికలు సిద్ధం చేస్తున్నాం..

ఎస్సీ స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఉన్నతి పథకం ద్వారా రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు ఇచ్చే రుణాన్ని రూ.5 లక్షలకు పెంచి రూ.50 వేలు రాయితీ అందించనున్నాం. జిల్లాలకు రూ.8 కోట్ల లక్ష్యంతో ఎస్సీ సభ్యులను ఎంపిక చేయనున్నాం.

- ఎన్వీఎస్ఎస్ మూర్తి, పీడీ-డీఆర్డీఏ

జిల్లాలో ఇదీ పరిస్థితి

నియోజకవర్గం	ఎస్సీ స్వయం సహాయక సంఘాలు	మొత్తం సభ్యులు
రాజమహేంద్రవరం గ్రామీణం	991	10,231
రాజానగరం	1,338	11,743
అనపర్తి	796	7,867
కొవ్వూరు	1,301	12,592
గోపాలపురం	1,865	18,306
నిడదవోలు	1,048	10,244

కొందరు ఎంపీడీవోల తీరుపై కలెక్టర్ ఆగ్రహం

రాజమహేంద్రవరం కలెక్టరేట్, న్యూస్టుడే: తమకు ముందస్తు సమాచారం లేకుండా జిల్లాలో కొందరు ఎంపీడీవోలు సెలవులపై వెళ్లిపోవడంపై జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టర్ వీసీ సమావేశమందిరం నుంచి క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్కు మండలస్థాయిలో అధికారులంతా ఒకచోట నుంచి హాజరు కావాలని ఆదేశించారు. కొందరు ఎంపీడీవోలు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సెలవులు పెట్టి వెళ్లిపోతున్నారని, సెలవు పెట్టేవారు తప్పనిసరిగా తెలియజేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో కొత్తగా విధుల్లో చేరిన ఎంపీడీవోలు తక్షణం తనకు రిపోర్టు చేయాలని, తర్వాతే విధులు నిర్వర్తించాలని, అప్పటివరకు విధుల్లోకి హాజరుకానట్లుగానే పరిగణిస్తామని స్పష్టం చేశారు.

పల్లె పండుగకు గైర్హాజరైతే చర్యలు: పల్లె పండుగ వారోత్సవాల్లో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నడుచుకోవాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. గ్రామాల వారీగా పనుల వివరాలు ప్రజలందరికీ తెలిసేలా ప్రదర్శించాలని, వాల్ పెయింట్స్ వేయించాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలు కార్యక్రమాల్లో పాల్గొనేలా చూడటంతో పాటు.. సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. మంగళవారం తాను మూడు గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహణను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని తెలిపారు. ప్రతి మండలం నుంచి లోతట్టు ప్రాంతాల్లో, ముంపు ప్రాంతాలతో పాటు సమస్య ఉన్న శ్మశానవాటికల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

● టెట్కు 399 మంది హాజరు

శ్యామలా సెంటర్: జిల్లాలో సోమవారం టెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రాజమహేంద్రవరం లూథర్గిరి ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఉదయం జరిగిన ఎస్జీటీ తెలుగు పరీక్షకు 240 మందికి గాను 210 మంది హాజరవ్వగా.. 30 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన మ్యాథ్స్ అండ్ సైన్స్ పరీక్షకు 240 మందికి గాను 189 మంది హాజరు కాగా.. 51 మంది గైర్హాజరయ్యారని డీఎస్ఈఓ కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు.

● ఇసుక రీచ్ల్లో సీసీకెమెరాల ఏర్పాటుకు ఆదేశాలు

రాజమహేంద్రవరం కలెక్టరేట్: ఈనెల 16 నుంచి ఇసుక రీచ్లు ప్రారంభం కానున్న దృష్ట్యా సీసీకెమెరాలు ఏర్పాటు చేసి 24 గంటల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రీచ్ పాయింట్కు 4 నుంచి 6 ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం పోల్స్ సిద్ధం చేయాలన్నారు. తదుపరి మాత్రమే ఇసుక రీచ్ల వద్ద తవ్వకాలు ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. దీనిపై ఆర్డీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

బక సంహార అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీవారు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆశ్వయుజ మాస తిరుకల్యాణోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. రెండో రోజు సోమవారం ధ్వజారోహణ నిర్వహించారు. శ్రీవారి కల్యాణ వైభవాన్ని వీక్షించేందుకు సర్వ దేవతలను ఆహ్వానించేలా ముహూర్త సమయంలో గరుడ పటం ఎగురవేశారు. స్వామివారి విశేష అలంకారాల్లో భాగంగా బక సంహార అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంపై, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం ఉంటుంది.




రైతేరాజు
అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 120 అర్జీలు

రాజమహేంద్రవరం కలెక్టరేట్: జిల్లా స్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఈ వారం అర్జీదారుల తాకిడి కొంచెం తగ్గింది. కలెక్టరేట్లోని సమావేశమందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో గతవారం 141 అర్జీలు రాగా.. ఈ వారం 120 అందాయి. జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు బి.స్వామినాయుడు ఇతర అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వీటిలో అత్యధికంగా రెవెన్యూశాఖ పరిధికి చెందినవి 47 ఉండగా, వ్యవసాయ శాఖ పరిధిలోనివి 22, పోలీసు శాఖ పరంగా 15, పంచాయతీరాజ్ శాఖకు చెందిన 9, ఇతర శాఖల పరిధిలోనివి 27 ఉన్నాయి. 2018లో మినీ గోకులాల నిర్మాణం చేపట్టామని, దీనికి సంబంధించి రూ.1.50లక్షల బిల్లులు పెండింగ్లో ఉన్నాయని ఉండ్రాజవరం మండలం మోర్తా గ్రామానికి చెందిన మద్దుగురి సుబ్బారావు అనే వ్యక్తి అధికారులకు విన్నవించారు.

దానవాయిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను నిర్దేశించిన సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ పేర్కొన్నారు. సోమవారం రాజమహేంద్రవరం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని 15 వినతులు స్వీకరించారు.

బడికి రానివారు 19%



అక్కడ స్ఫూర్తి

విద్యా వ్యవస్థకే ఆదర్శంగా నిలిచే కేరళ విధానంలో విద్యార్థుల గైర్హాజరు కేవలం 2.7 శాతం మాత్రమే. చాలా పాఠశాలల్లో వంద శాతం హాజరుంటుంది.

ఇక్కడ ఇలా..

అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ఎస్సీఈఆర్టీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 396 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలకు వరుస సెలవులు ఇచ్చే ముందురోజు(అక్టోబరు 10న) బడికి వచ్చిన వారి సంఖ్య 302. గైర్హాజరు అయినవారు 24%.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 3,812 పాఠశాలల్లో సగటున 19% మంది విద్యార్థులు బడికి హాజరు కావడం లేదు. [illegible] - న్యూస్‌టుడే, పామర్రు

ఏం జరుగుతోంది?

వరుసగా పిల్లలు నెలపాటు బడి మానేస్తే అటువంటి విద్యార్థి పేరు తీసేయకుండా అదే బడిలో డ్రాప్ బాక్సులో పెడుతున్నారు. [illegible] ఇలాంటి పిల్లలంతా ఒకవేళ తరువాత బడికొచ్చినా అభ్యసనలో వెనుకబడిపోతున్నారు.

పాఠశాలల హాజరు పుస్తకాల్లో విద్యార్థుల పేర్లు నమోదై ఉంటాయి. తరగతులకు మాత్రం హాజరు కావడం లేదు. [illegible] అసలు లేరని అంకెల గారడీ చేయడానికి విద్యాశాఖ నానా తంటాలు పడింది. బడి మానేసిన, పదోతరగతి ఫెయిల్ అయిన వారి వివరాలను కూడా ఆన్‌లైన్లో పొందుపరచాలని ఆదేశించారు.

డ్రాప్ బాక్స్ ఖాళీచేయించి..

ఎక్కువ రోజులు బడి మానేసిన విద్యార్థులను డ్రాపౌట్‌గా ఆన్‌లైన్లో నమోదు చేస్తుంటారు. [illegible] చేసేశారు. వారంతా కొత్త విద్యా సంవత్సరం వచ్చేసరికి ప్రమోట్ అయిపోయి కొత్త తరగతులకు పేర్లు వచ్చేశాయి. తాము ఫలానా బడిలో చదువుకుంటున్నామని, ఉత్తీర్ణత పొంది మరో తరగతికి వచ్చేశామన్న విషయం కూడా పాపం పిల్లలకు తెలియదు.

ఉన్నత పాఠశాలల్లో పరిశీలిస్తే..

అంబేడ్కర్ కోనసీమలో 17, తూర్పుగోదావరి జిల్లాలో 19, కాకినాడలో 21 శాతం మంది విద్యార్థులు పాఠశాలలకు రావడం లేదు. సగటున ఈ లెక్క 19 శాతం.

ఇవీ కారణాలు

● వ్యవసాయ పనులు, పండగలు, స్థానికంగా నిర్వహించే జాతరలు, సీజనల్ వ్యాధులు, వరదల కారణంగా పిల్లల గైర్హాజరు ఎక్కువయ్యిందని విద్యాశాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు.

● వలసలు కూడా ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

● ఇటుక బట్టీల పనులు, రొయ్యల చెరువుల పనులకు కూడా పలువురు వెళ్లడం, రావడం జరుగుతోంది. ఇలాంటివన్నీ కూడా హాజరు తక్కువగా ఉండడానికి కారణాలుగా కనబడుతున్నాయి.

సరిదిద్దే ప్రయత్నం

ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమీక్షిస్తూ.. [illegible] ముందుగా క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలు, కారణాలను అన్వేషిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పరిస్థితి చక్కదిద్దేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



కౌన్సిలర్ల అభిప్రాయాలు తెలుసుకుంటున్న కమిటీ సభ్యులు

కమిషనర్-డీఈ బాహాబాహీపై విచారణ

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పురపాలికకు సంబంధించి ఆగస్టు 31న జరిగిన కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ కనకారావు, డీఈ భవానీశంకర్ బాహాబాహీకి దిగడం అప్పట్లో సంచలనమైంది. [illegible] ఇలా చాలా వ్యవహారాలు జరుగుతున్నాయని, విచారణ చేయాలని అధికారులను కోరారు. పురపాలిక పరువుతీసిన వీరిద్దరినీ మార్చేయాలని కోరారు. బాగా పనిచేసే అధికారులను నియమించాలని కోరారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాలు)	ధర (రూ.లో)
కొత్తకొబ్బరి కురిడీ	11,500
పాతకాయ	17,500
	15,500
కొత్తకాయ	16,500
	14,500
సీటీ కాయ పాత	14,000-15,000
కొత్త	13,500-14,000
కొబ్బరినూనె 15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	135-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

లోవలో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు పూజలు




తుని గ్రామీణం: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో అమ్మవారికి సోమవారం ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానానికి వచ్చిన ఆయనకు ఆలయాధికారులు సాదరంగా స్వాగతం పలికారు. పూజల అనంతరం దేవస్థానం వేదపండితులు ఆశీర్వచనాలు అందించగా దేవస్థానం డీసీ విశ్వనాథరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

తులాభార వెండి తాపడానికి అంచనాలు

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో తులాభారానికి వెండి తాపడం చేయించడంపై అంచనాలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఈవో కె.రామచంద్రమోహన్ ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న తులాభారాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. వెండి తాపడం చేయించడానికి ఎంత వెండి అవసరం అవుతుందనే అంచనాలు రూపొందించాలన్నారు. దాతల సహకారంతో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

అమ్మ ఆర్థికంగా ఇబ్బంది పడకూడదని..

ఆత్మహత్యకు పాల్పడిన యువతి మృతి



సురేఖ (పాత చిత్రం)

ఆత్రేయపురం: తనకు వివాహం చేస్తే తల్లి ఆర్థికంగా ఇబ్బంది పడుతుందనే ఆవేదనతో ఓ యువతి పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటనపై ఆత్రేయపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎ.ఎస్.ఐ. పెద్దిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మెర్లపాలేనికి చెందిన సురేఖ(23) పేరవరం తపాలా కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నారు. అసలే ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న తల్లి.. తనకు వివాహం చేస్తే మరింతగా కష్టాలు పడుతుందనే ఆవేదనతో గత నెల 30న తాను పనిచేస్తున్న కార్యాలయం వద్ద పురుగు మందు తాగారు. అప్పటి నుంచి రాజానగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎ.ఎస్.ఐ. తెలిపారు.

ఆటో బోల్తా : విద్యార్థినులకు గాయాలు

చాగల్లు, కొవ్వూరు పట్టణం: కొవ్వూరు గామన్ వంతెన సమీపంలో గుంతను తప్పించే క్రమంలో ఆటో బోల్తాపడి ఆరుగురు విద్యార్థినులకు స్వల్ప గాయాలయ్యాయి. దొమ్మేరుకు చెందిన విద్యార్థినులు కొవ్వూరులోని జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. రోజూ మారిదిగా ఆటోలో వస్తుండగా కొవ్వూరు గామన్ వంతెన వద్దకు వచ్చేసరికి గుంతను తప్పించే క్రమంలో అది బోల్తాపడింది. గాయపడిన విద్యార్థినులను హైవే పెట్రోలింగ్ వాహనంలో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి తరలించారు. చికిత్స అనంతరం వారు ఇంటికి చేరుకున్నారు. ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



ఆసుపత్రిలో బాలికకు చికిత్స



పెట్రోలింగ్ వాహనంలో క్షతగాత్రులను తరలిస్తున్న సిబ్బంది

మద్యానికి బానిసై ఆత్మహత్య

కొత్తపేట: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు కొత్తపేట ఎస్సై సురేంద్ర తెలిపారు. మోడేకుర్రు గ్రామ శివారు గొలకోటివారిపాలేనికి చెందిన ఈతకోట నాగరాజు(48) కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యం తాగే అలవాటు ఉంది. దీనిపై భార్య మందలించడంతో మనస్థాపంతో ఆదివారం రాత్రి ఇంటివద్ద పురుగు మందు తాగేశాడు. అపస్మారక స్థితిలో పడి ఉండటంతో భార్య సత్యవతి, కుమారుడు అవినాష్‌లు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'మైనింగ్ వాళ్లను బెదిరించారనడం అవాస్తవం'

మసీదు సెంటర్ (కాకినాడ): డిప్యూటీ సీఎం పేరు చెప్పి మైనింగ్ వాళ్లను బెదిరించారనడం అవాస్తవమని కాకినాడ జిల్లా అటవీ శాఖ అధికారి డి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా అటవీ శాఖ కార్యాలయం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ప్రభుత్వం చేసిన పారదర్శక బదిలీల్లో కాకినాడ డీఎఫ్‌వోగా బాధ్యతలు స్వీకరించి రెండు రోజులు మాత్రమే విధుల్లో ఉండి, తరవాత కుటుంబం, లగేజీ తీసుకొచ్చేందుకు పాతస్టేషన్‌కు వెళ్లానన్నారు. కాకినాడ ప్రాంతం తనకు కొత్తని, ఇక్కడ జరిగే విషయాలపై అవగాహన లేదన్నారు. నేను కాకినాడలో విధుల్లో చేరడం ఇష్టం లేని వాళ్లు దుష్ప్రచారం చేసి ఉంటారన్నారు.

వ్యక్తికి రిమాండ్

ఆత్రేయపురం: మండలంలోని ఓ గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన నల్లూరి శివను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. కొత్తపేట కోర్టులో హాజరుపర్చగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై రాము తెలిపారు. నిందితుడిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించామన్నారు. జరిగిన సంఘటనపై ఐసీడీఎస్ సీడీపీవో శారద, సూపర్‌వైజర్ కుమారి, వివిధ శాఖల అధికారులు బాధిత బాలిక ఇంటికెళ్లి విచారణ జరిపారు.

తీపిజొన్న సాగు.. లాభాలు బాగు

రైతేరాజు

న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

మొక్కజొన్న పొత్తులు(స్వీట్‌కార్న్) చూస్తే ఎవరికైనా నోరూరుతుంది. వీటికి మార్కెట్‌లో గిరాకీ ఉండటంతో సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. ఈ పంటను జిల్లాలోని పలుచోట్ల పండిస్తున్నా జగ్గంపేట మండలం కాట్రావులపల్లి పొత్తులకు మాత్రం ప్రత్యేక గుర్తింపు ఉంది. సారవంతమైన నల్లరేగడి నేలలు కావడంతో నాణ్యత, రుచి, సైజులో పెద్దవిగా ఉండటం వీటి ప్రత్యేకత. దీంతో ఇక్కడి పొత్తులకు మంచి గిరాకీ ఉందని రైతులు చెబుతున్నారు. స్థానిక వ్యాపారులతో పాటు జిల్లాలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాలు, బెంగళూరు, తమిళనాడు, ఒడిశా వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. స్వీట్‌కార్న్‌తో పాటు కోళ్ల దాణాకు ఉపయోగించే పొత్తులను ఇక్కడి రైతులు విస్తారంగా పండిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో పండించిన వాటిని అమ్మేందుకు సైతం తీసుకురావడంతో ఏడాది పొడవునా పొత్తులు అందుబాటులో ఉండి కొనుగోలుదారులతో మార్కెట్ కళకళలాడుతోంది.



స్ఫూర్తి

పంట దిగుబడి ఇలా...

మార్కెట్‌లో లభించే నాణ్యమైన మొక్కజొన్న విత్తనాలను ఎంపిక చేసుకుని నాట్లు వేస్తారు. ఎకరాకు 6 నుంచి 7 టన్నుల దిగుబడి వస్తుంది. టన్ను రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ధర ఉంటుంది. కాట్రావులపల్లి, యర్రంపాలెం, సీతానగరం తదితర గ్రామాలతో పాటు మండలంలోని సుమారు 150 ఎకరాల్లో మొక్కజొన్న పండిస్తున్నారు. ఇక్కడ పండించిన పంటకు స్థానికంగానే మార్కెట్ ఉండటంతో ఇబ్బందులు ఉండవని రైతులు చెబుతున్నారు.



కాట్రావులపల్లిలో పండిస్తున్న మొక్కజొన్న


మెలకువలు పాటిస్తే ..



రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న పండిస్తున్నా. పెట్టుబడి, శిస్తు, ఎరువులు, కూలీల ఖర్చు పోను ఎకరాకు రూ.30 వేల వరకు ఆదాయం వస్తుంది. నాట్లు వేసిన 70 నుంచి 80 రోజుల్లో పూర్తవడంతో ఏడాదికి మూడుసార్లు పంట వేయడంతో ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం సమకూరుతుంది. సాగులో మెలకువలు పాటిస్తే మంచి ఆదాయం వస్తుంది.

- గంధం దుర్గాప్రసాద్, కౌలురైతు

కోకోలో తెగుళ్లు నివారిద్దాం..



కొబ్బరి తోటల్లో అంతర పంటగా సాగు చేస్తున్న కోకో పంటకు సంబంధించిన వివిధ సమస్యలపై రైతులు అడిగిన ప్రశ్నలకు అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రం తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త బి.నీరజ పలు సూచనలు ఇచ్చారు.

- న్యూస్‌టుడే, అంబాజీపేట

ప్రశ్న సమాధానం

● అకాల వర్షాల ప్రభావంతో కోకోలో కాయకుళ్లు తెగుళ్లు ఎక్కువగా ఉన్నాయి. ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవాలి?

- ఎ.రాజమోహన్, రైతు, పుల్లేటికుర్రు


సమాధానం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కాయకుళ్లు తెగులుకు సోకడానికి అనుకూలం. ఈ తెగులుకు ప్రధాన కారణం ఫైటోఫ్తోరా పామివోరా అనే బూజు జాతి శిలీంధ్రం. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు.. లీటరు నీటిలో కలిపి కాయలు మొత్తం తడిచేలా పిచికారీ చేయాలి.

● కోకో పంటకు సోకే గజ్జి తెగులు నివారణ చర్యలు తెలపండి?

- జి.వెంకటేశ్వరరావు, రైతు, ముమ్మిడివరం

సమాధానం: కోకో చెట్టు కాండంపై ముదురు ఎరుపురంగు చిక్కటి జిగురు కారి, క్రమేణా అవి ఎండి తుప్పు మరకలా కనిపిస్తాయి. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ పేస్టు లేదా ట్రైకోడెర్మా బూజు జాతి శిలీంధ్రం పేస్టును మచ్చలపై పూతలా వేయాలి.

సేంద్రియ ఎరువుతో నాణ్యమైన పట్టు




గొల్లప్రోలు: సేంద్రియ ఎరువుల వాడకంతో నాణ్యమైన మల్బరీ ఆకును ఉత్పత్తి చేసి పట్టుగూళ్ల పెంపకంలో అధిక దిగుబడులు సాధించొచ్చని పట్టుపరిశ్రమల శాఖ అధికారి **మోసయ్య** తెలిపారు. నాణ్యమైన మల్బరీ ఆకును పొందేందుకు తోటల పెంపకంలో చేపట్టాల్సిన చర్యలను ఆయన ఇలా వివరించారు.

తెలుసుకుందాం..

◆ ప్రతి పంటకు ముందు పశువుల ఎరువులను విధిగా వేయాలి. తద్వారా ఆకు నాణ్యత పెరిగి.. వీటిని ఆహారంగా తీసుకున్న పట్టుపురుగు నాణ్యమైన గూడును అల్లుతుంది. ◆ భూసారాన్ని బట్టి అవసరమైతే కాంప్లెక్స్ ఎరువులు వాడాలి. యూరియా వాడకాన్ని తగ్గించాలి. ◆ కోత కోసిన 50 రోజుల తరువాత మాత్రమే ఆకులను పట్టు పురుగులకు మేతగా వేయాలి. ◆ మల్బరీ తోటలో యూరియా అధికంగా వేస్తే పట్టు పురుగులకు పొరుడు రోగం ఆశించి నష్టం వాటిల్లుతుంది. ◆ బైవోల్టిన్ పట్టు పురుగులు పెంచే రైతులు విధిగా పశువుల ఎరువులను ఉపయోగించాలి. ◆ పట్టు పురుగులు పెంచే షెడ్లలో 25-28 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండేలా చూడాలి. తేమ విషయమై నిరంతరం పర్యవేక్షించాలి.

ఇలా చేస్తే పండుగప్పతో ఆదాయమే..



ఉప్పలగుప్తం: పండుగప్ప చేపల సాగులో వ్యాధుల బెడద వేధిస్తోంది. జాగ్రత్తలు పాటిస్తే నివారించవచ్చని ఉప్పలగుప్తం మత్స్యశాఖాధికారి **హేమనంద్** సూచిస్తున్నారు.

వ్యాధి ఇలా..: పండుగప్పలకు ఆహారంగా చైనా గొరకలు, రొయ్యల ప్రోసెసింగ్ కంపెనీల నుంచి సేకరించిన వ్యర్థాలను రైతులు వేస్తున్నారు. వ్యాధి ప్రభావం ఉన్న చెరువుల నుంచి సేకరించినది కావడంతో రెడ్, తాటాకు, బూజు తెగుళ్ల సోకుతున్నాయి.

జాగ్రత్తలు: ◆ పట్టుబడి పూర్తయిన చెరువులను నెర్రలు వచ్చేవరకూ ఎండబెట్టాలి.

మీ కోసం

◆ పిల్లెట్ రూపంలో మార్కెట్లోకి వచ్చిన ప్రొటీన్ మేత ఇస్తే వ్యాధులు రావు. ◆ ల్యాబ్ పరీక్షలు చేయించి నిపుణుల సూచనలు పాటించాలి. నీటి మార్పిడి చేసుకుని చెరువు శుభ్రతకు శానిటైజర్లు చల్లుకోవాలి.

19 నుంచి రైఫిల్ షూటింగ్ పోటీలు

రాజానగరం: సంపతనగరంలో గల రాజమహేంద్ర ఇంటర్నేషనల్ స్కూల్లో ఈ నెల 19 నుంచి 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ రైఫిల్ షూటింగ్ పోటీలు నిర్వహించనున్నామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎస్.ఆర్.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

సినిమాలు: దానవాయిపేట: శ్యామల, ఊర్వశి: వేట్టయన్, రాజా: మార్టిన్, కుమారి, సూర్యప్యాలెస్, అప్సర: దేవర, శివజ్యోతి, అశోక్: విశ్వం, స్వామి: స్వాగ్, అనుశ్రీ: జనక అయితే గనక, సూర్యమినీ: జిగ్రా, రంభ: మా నాన్న సూపర్ హీరో, మేనక: సత్యం సుందరం, మార్టిన్(రెండేసి ఆటలు), వీఎస్ మహల్: వేట్టయన్, దేవర(రెండేసి ఆటలు).

రాజమహేంద్రవరం

17న వాల్మీకి జయంతి వేడుకలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రసంగ తరంగిణి సాహిత్య సభలో భాగంగా ఈనెల 17న వాల్మీకి జయంతి వేడుక నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు కె.సత్యనారాయణమూర్తి తెలిపారు. గురువారం ఉదయం 10గంటలకు ఆదిత్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో జరిగే కార్యక్రమంలో 'వాల్మీకి కవిత్వ సౌందర్యం' అనే అంశంపై ప్రసంగం ఉంటుందని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా



సమస్య: స్థానిక చౌడేశ్వరీనగర్ శివారు లోని సింగిల్ బీటీ రోడ్డు సగం పూర్తిగా చెత్తతో నిండిపోయింది. ఇక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. **- భాస్కరరాజు, స్థానికుడు**

సమాధానం: చెత్త తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **- వినూత్న, ఎంహెచ్‌వో**

సమస్య: తారకరామనగర్‌లోని శివారు రోడ్డులో వీధిదీపాలు గత వారం రోజులుగా వెలగడంలేదు. దీంతో రాత్రి వేళ అంధకారంగా ఉంటోంది. తక్షణం మరమ్మతులు చేయించాలి. **- వీరాజు, స్థానికుడు**

సమస్య: వీరభద్రనగర్‌లోని రెండో వీధిలో వారం రోజులుగా వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రిపూట ఇబ్బందిగా ఉంటోంది. **- జి.వెంకటలక్ష్మి, స్థానికురాలు**

సమాధానం: వీధిదీపాల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. **- దేవీభ్రమరాంబిక, ఎలక్ట్రికల్ ఏఈ, ఆర్‌ఎంసీ**

- న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

మీ ప్రాంతంలో ప్రజా సమస్యలు ఇబ్బంది పెడుతున్నాయా? ప్రభుత్వం నుంచి సక్రమంగా అందాల్సిన లబ్ధి మీకు చేరలేదా? సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. చిత్రాలను, వివరాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం. సంప్రదించాల్సిన నంబర్లు...

83282 39927, 80089 02897

ఇలాగైతే ముప్పు.. ఏదీ కనువిప్పు

అజాగ్రత్తతో బలవుతున్న నిండు ప్రాణాలు

ఏటా పెరుగుతున్న లెక్కలే ఇందుకు సాక్ష్యాలు



రైల్వేస్టేషన్‌లో పట్టాలు దాటుతూ..

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

రైలు వచ్చే ముందు హడావుడిగా పట్టాలు దాటుతూ కొందరు... కదిలే రైలు ఎక్కేందుకు ప్రయత్నిస్తూ మరికొందరు.. బోగీల్లో ద్వారం వద్ద ఫుట్‌బోర్డుపై నిర్లక్ష్యంగా కూర్చొని ప్రయాణిస్తూ ఇంకొందరు... ప్రమాదాల బారిన పడుతున్నారు. నిర్లక్ష్యం.. ప్రయాణాల్లో అజాగ్రత్త కారణంగా ఎందరో నిండు ప్రాణాలను పోగొట్టుకుంటుండగా మరికొందరు అవయవాలు కోల్పోయి క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు. ప్రమాదమని తెలిసినా కొందరు ప్రయాణికుల ధోరణిలో మార్పు రావడంలేదు.. తరచూ ప్రమాదాలు జరిగి అనేక మంది మృతి చెందుతున్నా కనువిప్పు కలగడంలేదు.



సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లో బోగీ ద్వారంవద్ద..

రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌లో ఒక ప్లాట్‌ఫామ్ నుంచి మరొక ప్లాట్‌ఫామ్‌పైకి వెళ్లేందుకు కాలిబాట వంతెనలు ఉన్నా మరికొందరు హడావుడిగా పట్టాలు దాటుతున్నారు. ఇది ప్రమాదమని గ్రహించాలి. ముఖ్యంగా ఇలాంటి రద్దీ సమయంలో ప్రయాణికులు మరింత అప్రమత్తంగా ఉండాలి. లేకుంటే ప్రమాదాల బారిన పడాల్సివస్తుందని రైల్వే పోలీసులు హెచ్చరిస్తున్నారు.

2021 నుంచి ఇప్పటివరకు రాజమహేంద్రవరం జీఆర్పీ పరిధిలో మృతులు ఇలా..

సంవత్సరం	రైళ్ల నుంచి జారిపడి	పట్టాలు దాటుతూ
2021	05	19
2022	19	13
2023	20	10
2024	15	20

నాలుగేళ్లలో 121 మంది మృత్యువాత

రాజమహేంద్రవరం జీఆర్పీ పోలీసుస్టేషన్ పరిధిలోని ఇటు రోడ్డుకంరైలు వంతెన నుంచి అటు ద్వారపూడి రైల్వేస్టేషన్ వరకు గత నాలుగేళ్లలో జరిగిన ప్రమాదాలు పరిశీలిస్తే.. 2021 నుంచి ఈ ఏడాది ఇప్పటివరకు రైళ్ల నుంచి జారిపడి 59 మంది, పట్టాలు దాటుతూ 62 మంది కలిపి మొత్తం 121 మంది ప్రయాణికులు మృతిచెందారు. మృతుల్లో 111 మంది పురుషులు, పది మంది మహిళలు ఉన్నారు.

అప్రమత్తం చేస్తున్నాం

ప్రయాణికులు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతో పాటు ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేస్తూనే ఉంటున్నాం. ఫుట్‌బోర్డులపై కూర్చుని ప్రయాణాలు చేయడం, కదులుతున్న రైలు వెంట పరుగెత్తి ఎక్కే ప్రయత్నం చేయొద్దు. నిర్లక్ష్యంగా పట్టాలు దాటడం వల్ల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. **- పి.శ్రీనివాస్, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్, రాజమహేంద్రవరం**

పుట్టగొడుగుల పెంపకంతో ఆదాయ మార్గాలు



కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ ఏడాది విద్యార్థినులు మిల్కీ పుట్టగొడుగుల పెంపకం సాగించి వాటి అమ్మకాలు మొదలు పెట్టారు. వృక్షశాస్త్ర విభాగం పర్యవేక్షణలో సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన పుట్టగొడుగుల అమ్మకాన్ని ప్రిన్సిపల్ రాఘవ కుమారి ప్రారంభించారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉత్పత్తి చేసే వీటికి డిమాండ్ ఎక్కువగా ఉందని, తద్వారా ఆదాయ మార్గాలను పెంపొందించుకోవచ్చన్నారు. వృక్ష శాస్త్ర విభాగాధిపతి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

ప్రకాశంనగర్ పార్కులో సౌకర్యాలు కల్పించాలి

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం నగర నడిబొడ్డులో ఉన్న ప్రకాశంనగర్ రౌండ్ పార్కులో నగరవాసులు ఎక్కువగా సందడి చేస్తూ కనిపిస్తారు. ముఖ్యంగా దీనిని వాకింగ్ కోసం వినియోగించుకునే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. విద్యుత్ దీపాలు, ఫౌంటెయిన్ వంటివి అందుబాటులో ఉన్నప్పటికీ కనీస సౌకర్యాలు పార్కులో ఏర్పాటు చేయాలని ఇక్కడకు వచ్చే విశ్రాంత ఉద్యోగులు కోరుతున్నారు. బాత్‌రూమ్ అందుబాటులో లేదని, ఫిల్టర్ వాటర్ అమర్చలేదని.. దృష్టి పెట్టాలని కె.రామకృష్ణారావు, వి.రామచంద్రారెడ్డి, పి.వెంగళరెడ్డి తదితరులు కోరారు.



పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు

కొనసాగిన తిరుగు ప్రయాణికుల రద్దీ



దసరా అనంతరం తిరుగుప్రయాణికుల రద్దీ సోమవారం కూడా కొనసాగింది. అటు ఆర్టీసీ బస్టాండ్లు, ఇటు రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. తిరుగు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రాజమహేంద్రవరం ప్రధాన బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు నాలుగు ప్రత్యేక సర్వీసులు నడిపారు. ఇక్కడి నుంచి విశాఖపట్నానికి షెడ్యూల్ సర్వీసులతో పాటు అదనంగా తొమ్మిది బస్సులను నడిపినట్లు ఆర్టీసీ డిపో అధికారులు తెలిపారు. విజయవాడ, కాకినాడ నాన్‌స్టాప్ సర్వీసులతో పాటు లోకల్ సర్వీసులు రద్దీగా నడిచాయి. ప్రధాన బస్టాండ్, పల్లెవెలుగు సర్వీసులు ప్రాంగణంలో ప్రయాణికులకు నిరీక్షణ తప్పలేదు. ప్రధాన రైల్వేస్టేషన్‌లోనూ అదే పరిస్థితి. సోమవారం విజయవాడ- శ్రీకాకుళంరోడ్డు, కాకినాడ జంక్షన్-లింగంపల్లి ప్రత్యేక రైళ్లు నడిచాయి. **- న్యూస్‌టుడే, వి.ఎల్.పురం**

ఘనంగా పల్లె పండుగ

బొమ్మూరు: పల్లెపండుగతో గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపిస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. పిడింగొయ్యిలో రూ.3 కోట్లతో అంతర్గత రోడ్లు, కాలువలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తెదేపా నాయకులు మార్నివాసు దేవరావు, మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే మన ప్రభుత్వ లక్ష్యమన్నారు. మజ్జి పద్మ, ఏపీఓ సత్యవతి, పశుసంవర్థక శాఖ అధికారులు గ్రామంలో పనుల వివరాలు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. శాటిలైట్‌సిటీలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

హుకుంపేట: 13,326 పంచాయతీలకు గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి పనులకు తీర్మాణం చేయడం చారిత్రాత్మక విషయమని గోరంట్ల అన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ ఎస్ఈ పాండురంగారావు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వినతులు అందాయి.



వినతులు పరిశీలిస్తున్న మున్సిపల్ ఎస్ఈ పాండురంగారావు

చెప్పకుండా కూల్చేశారు



స్థానిక మల్లినగర్‌లో బడ్డీకొట్టు నిర్వహిస్తున్నాం. మున్సిపల్ అధికారులు కనీసం సమాచారం లేకుండా కూల్చేశారు. అప్పు చేసి దుకాణాన్ని నిర్వహిస్తున్నాం. సమయం ఇస్తే దుకాణంలో వస్తువులను జాగ్రత్త చేసుకొనేందుకు అవకాశం ఉండేది. **- సునీత, ఈశ్వరి**

ఇల్లు కోసం తిరుగుతున్నా..



బొమ్మూరు ఫేజ్-11లో టిడ్కో ఇల్లు మంజూరైంది. మొదట్లో కేటాయించిన ఇంటి నిమిత్తం 12,500 చెల్లించినా.. ఇప్పటికీ ఇల్లు స్వాధీనం చేయలేదు. ఇంకా నిర్మాణం పూర్తి కాలేదని చెబుతున్నారు. టిడ్కో ఇల్లు ఎప్పటికి పూర్తి చేస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. **- భారతీదేవి**

ఆక్రమణలు తొలగించాలి



జాంపేట వంతెన కింద కొంతమంది రోడ్డుపై అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తున్నారు. గతంలో ఫిర్యాదు చేసినా మున్సిపల్ యంత్రాంగం పట్టించుకోలేదు. తద్వారా వెనుక ఉన్న నివాసితులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. **- నాగలక్ష్మి**

పడితే గానీ పట్టించుకోరా?



రాజమహేంద్రవరంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం అన్నపూర్ణమ్మ పేట. ఇక్కడి రైల్వేగేటు నుంచి తాడితోట వాంబే గృహాలకు వెళ్లే మార్గంలో రోడ్డంతా గుంతలమయంగా మారింది. విద్యార్థులు ఈ మార్గంలో ప్రయాణించేందుకు అవస్థ పడుతున్నారు. అధికారులు స్పందించాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, ఏ.వి.ఏ రోడ్డు**

విరివిగా మొక్కలు నాటాలి



సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

టి.నగర్, న్యూస్‌టుడే: ఆర్యాపురం ఏబీ నాగేశ్వరరావు పార్కులో సౌకర్యాలు మెరుగు పరచాల్సిన ఆవశ్యకత ఉందని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం 39వ డివిజన్‌లో పర్యటిస్తూ, పార్కును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పార్కులో ఆహ్లాదం కోసం విరివిగా మొక్కలను నాటాల్సి ఉందన్నారు. సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు రాత్రి సమయాల్లో పార్కు గోడలు దూకి లోపలికి ప్రవేశించకుండా నిఘా ఉంచాలని పోలీసులను ఆదేశించారు. మున్సిపల్ ఆరోగ్యాధికారిణి వినూత్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మార్టిన్ లూథర్

రాజానగరం, న్యూస్‌టుడే: గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ కోరారు. రాజానగరంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులుతో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, మండల, వార్డు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని, పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసే వారిని గుర్తించి ఆయా కమిటీలలో నియమించాలని సూచించారు. పార్టీ నాయకులు వై.ఎ.వడయార్, ముప్పిడి శ్రీనివాస్, అడుసుమిల్లి రమేష్, ఎ.ఏడుకొండలు, జి.శ్రీధర్, పి.గణేష్, రంగా శ్రీనివాస్, డా.శ్రీనివాస్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

రాజమహేంద్రవరం నేరవార్తలు: మేదరపేట ప్రాంతానికి చెందిన ఓ బాలిక (16) ఈ నెల 12వ తేదీ నుంచి కనిపించడం లేదని బాలిక తల్లి సోమవారం మూడో పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని..

నారాయణపురం ప్రాంతానికి చెందిన ఎన్.రామ్‌ప్రసాద్ తన ద్విచక్ర వాహనంపై ఆదివారం రాత్రి జేఎన్‌రోడ్డులో వెళ్తున్న తరుణంలో మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఆ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆ మేరకు ఆసుపత్రి వర్గాలు ప్రకాశంనగర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు.

సారా కేసులో మహిళ అరెస్టు

అయిదుబళ్ల మార్కెట్ ప్రాంతానికి చెందిన సి.వెంకటలక్ష్మి తన ఇంటి వద్ద సారా విక్రయిస్తుండగా రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఆమె వద్ద ఉన్న అయిదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ దుర్గారావు తెలిపారు.

వేడుకగా నిమజ్జనాలు



నిమజ్జనానికి వెళ్తున్న అమ్మవారు



గోదారమ్మ ఒడిలో కలిసిపోతూ..



అమ్మవారి ఊరేగింపులో యువకుల సందడి

ఎ.వి.ఎ రోడ్డు, న్యూస్‌టుడే: దసరా పూజలు పూర్తయిన నేపథ్యంలో దుర్గాదేవి విగ్రహాలను నగరవాసులు ఘనంగా ఊరేగించి నిమజ్జనానికి తీసుకువెళ్లారు. సోమవారం కూడా అమ్మవారి నిమజ్జనాలు కొనసాగాయి.

'కుంగి'పోతున్నా పట్టదా?



ఆవలో..



అన్నపూర్ణమ్మపేటలో..

ఏ.వి.ఏ రోడ్డు, న్యూస్‌టుడే: నగరంలోని చాలా ప్రాంతాల్లో డ్రైనేజీ గట్లు, ఫుట్‌పాత్‌ల వద్ద రోడ్డు శ్లాబులు కుంగి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. గాంధీపురం, లలితానగర్, ఆవ రోడ్డు, అన్నపూర్ణమ్మ పేట తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

ఫ్లాష్.. ఫ్లాష్ మోరంపూడి సమీపంలో రోడ్డు ప్రమాదం

● ఒకరికి తీవ్ర గాయాలు ● మరో ముగ్గురికి తప్పిన ముప్పు

దానవాయిపేట, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం గ్రామీణం మోరంపూడిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో మోరంపూడి కూడలి నుంచి నామవరం వైపు అతివేగంగా వెళ్తున్న ఓ కారు మార్గంలో ఓ సిమెంట్ దిమ్మ, తర్వాత స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఢీకొంది. అదే వేగంతో కాంక్రీట్ కలిపే యంత్రాన్ని ఢీకొని పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదం జరిగే సమయంలో కారులో నలుగురు వ్యక్తులున్నారు. వీరిలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమైంది. ఘటనా స్థలానికి చేరుకున్న బొమ్మూరు పోలీసులు విచారణ చేపట్టారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.



ప్రమాదంలో ధ్వంసమైన కారు



ఆసుపత్రికి బాధితుడి తరలింపు

తప్పని కలవరం

వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి అన్నదాతలను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. వరినాట్ల దశలో భారీ వర్షాలు, గోదావరి వరదల కారణంగా పలు మండలాల్లో పొలాలు ముంపునకు గురై నష్టపోయాయి. మళ్లీ నాట్లు వేసి నానా ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు పంట కోతలకు సమయాత్తమైన తరుణంలో వాతావరణ మార్పులు వరి రైతులను కలవరపెడుతున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సాధారణ పంట విస్తీర్ణం 77,817 హెక్టార్లు కాగా ప్రస్తుత ఖరీఫ్‌లో 72,246 హెక్టార్లలో వరిసాగు జరిగింది. ప్రస్తుతం వరి పంటలు కోతల దశకు చేరుకున్నాయి. కొన్ని మండలాల్లో కోతలకు రైతులు సన్నద్ధమవుతుండగా.. మరికొన్ని చోట్ల ఇప్పటికే సన్నరకాలైన పీఆర్-126, పీఆర్ బయో పంట కోతలు మొదలయ్యాయి. నల్లజర్ల, నిడదవోలు, చాగల్లు, కొవ్వూరు మండలాల్లో 418 హెక్టార్లలో కోతలు జరిగినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

మధురం.. సాయి పుణ్యతిథి ఉత్సవం



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

కోరుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీ శిర్డీ సాయినాథుని ఆలయాల్లో బాబా పుణ్యతిథి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక ద్వారకాసాయినగర్, పెట్రోలు బంకు సమీపంలోని సాయి మందిరం, బూరుగుపూడి ద్వారకా శిర్డీసాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ద్వారకాసాయినగర్ ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. సహస్ర గులాబీ అర్చన, పెద్దఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. బూరుగుపూడి ద్వారకా శిర్డీసాయిబాబా ఆలయంలో సాయిరాం పాఠశాల విద్యార్థులు చేసిన సీతారాముల కల్యాణం ఆద్యంతం అలరించింది. పెట్రోలు బంకు సమీపంలోని సాయి ఆలయంలో సాయి సత్యవ్రతాలు వైభవంగా జరిగాయి.

అదే నిర్లక్ష్యం.. ఇదే సాక్ష్యం..



ఏ.వి.ఏ రోడ్డు, న్యూస్‌టుడే: నగరంలో చాలా ప్రాంతాల్లో రహదారికి సమానంగా మురుగు కాలువలు చెత్తతో నిండుగా దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల కాలువలో అడుగున మట్టి పూడిక పేరుకుపోయి, చిన్న పాటి వర్షానికే కాలువలు పొంగి రోడ్లపై ప్రవహిస్తున్నాయి. ఈ పరిస్థితి ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం కనిపిస్తోంది.

చెత్తను తొలగించరూ..



శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: శ్యామలా సెంటర్‌లోని పలు ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. ముఖ్యంగా శ్యామలా సెంటర్ కూడలి నుంచి సాయికృష్ణా థియేటర్ రోడ్డుకు వెళ్లే రహదారిలోని ఓ వీధిలో ఎక్కడ చెత్త అక్కడే ఉండటంతో స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చినుకు పడితే నరకమే...

చౌడేశ్వరీనగర్‌లో ఇదీ పరిస్థితి

ఏ.వి.ఏ రోడ్డు, న్యూస్‌టుడే: స్థానిక 50వ డివిజన్ లాలాచెరువు చౌడేశ్వరీ నగర్-1 ప్రాంతంలోని 1, 2 వీధుల్లో ప్రజలు గత రెండేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే కాలువలు పొంగి ఇళ్లలోకి మురుగు నీరు చేరే పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో జలదిగ్బంధంలో చిక్కుకుంటూ.. వర్షం వచ్చిన ప్రతిసారీ బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నామని వాపోతున్నారు. దుర్వాసనతో జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలువతో ఇబ్బంది

సుమారు రెండేళ్ల క్రితం స్పిన్నింగ్ మిల్-2, హౌసింగ్ బోర్డు నుంచి పెద్ద కాలువను ఈ ప్రాంతానికి అనుసంధానం చేశారు. ఈ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న పెద్ద కాలువ పూర్తి స్థాయిలో వాడుకలోకి రాకపోవడం, పై నుంచి వచ్చే నీరు కలిసి ఇక్కడ మురుగు పొంగి పొర్లుతుండటం పరిపాటైంది. డ్రైనేజీలు పునః నిర్మించాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు.



సోమవారం ఉదయానికి బురదతో ఉన్న వీధులు

చాలా ఇబ్బందిగా ఉంది



మా ప్రాంతంలో సుమారు రెండు ఏళ్లుగా మురుగు ముంపు సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. పెద్ద కాలువ పూర్తి స్థాయిలో నిర్మించాల్సి ఉంది. ఎంత మందికి విన్నవించినా ఫలితం ఉండటం లేదు. **- ప్రకాష్ రావు, స్థానికుడు**

మా ఇంట్లోకి నీరు చేరుతోంది



వర్షం వచ్చిన ప్రతిసారీ మా ఇంట్లోకి మురుగునీరు, వ్యర్థాలు, చెత్త వంటివి చేరి చాలా ఇబ్బంది పడుతున్నాం. పిల్లలు తరచుగా అనారోగ్యం బారిన పడుతున్నారు. అధికారులు స్పందించాలి. **- సునీల్ కుమార్, కాలనీవాసి**

బాల్‌బ్యాడ్మింటన్‌లో బిక్కవోలు బాలికల ప్రతిభ

బిక్కవోలు: అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బిక్కవోలు బాలికలు ప్రతిభ చూపి తూర్పు గోదావరి జట్టు విజయం సాధించడంలో కృషి చేశారని ప్రధానోపాధ్యాయులు పి.వి.ప్రభాకర్ తెలిపారు. ఇటీవల విశాఖ జిల్లా నునపర్తిలో జరిగిన 9వ జూనియర్ అంతర్‌జిల్లా పోటీలు జరిగాయని తెలిపారు. ఈపోటీల్లో జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించిందన్నారు. అందులో బిక్కవోలు జడ్పీ పాఠశాలకు చెందిన చాందిని శ్రియ, దుల్లా అలేఖ్య ప్రతిభ చూపి జిల్లా జట్టు విజయం సాధించడంతో ప్రతిభ కనబరిచారని తెలిపారు.


జట్టు విజయానికి కృషి చేసిన విద్యార్థినులు

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

నేడు సీసీ రహదారులకు శంకుస్థాపన

రంగంపేట, న్యూస్‌టుడే : పల్లె పండుగ... పంచాయతీ వారోత్సవాలలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం రంగంపేట మండలంలోని గ్రామాల్లో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శ్రీకారం చుడతారని పంచాయతీరాజ్ జేఈ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఎస్.టి.రాజాపురం, వడిశలేరు, పెదరాయవరం, చండ్రేడు, రంగంపేట, ముకుందవరం, ఈలకొలను, అచ్యుతాపురం, వీరంపాలెం, జి.దొంతమూరులోని సీసీ రోడ్ల నిర్మాణాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా

దుర్వాసనతో ఇబ్బందులు..

సమస్య: సీతానగరంలోని దొమ్మేటివారి వీధిలో సిమెంటు రోడ్డుపై చెత్త పేరుకుపోయి దుర్వాసనతో అల్లాడుతున్నాం. దోమలు పెరిగిపోతున్నాయి. **- అంచూరి విమల, అనుసూయ, సీతానగరం**

పరిష్కారం: మేమున్నాం.. మీకు తోడుగా 'ఈనాడు'కు వచ్చిన ఈ సమస్యను సీతానగరం పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పంచాయతీ కార్యదర్శి ఎస్‌వీవీ సత్యనారాయణ మూర్తి పరిష్కారం చేశారు. పారిశుద్ధ్య కార్మికులను పంపించి డంపింగ్ యార్డుకు చెత్తను తరలించారు. **- న్యూస్‌టుడే, సీతానగరం**

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: **91212 29057**, కడియం: **91212 29062**, అనపర్తి: **91000 20947**

పూడికలు తొలగించండి

బొమ్మూరు, న్యూస్‌టుడే: కాతేరు సబ్‌సెంటర్ సమీపంలో రహదారి పక్కన పూడికల వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో ఉన్న వ్యర్థాలు తీసి రోజులు గడుస్తున్నా వాటిని తొలగించలేదని చెబుతున్నారు. పందులు చేరి మట్టిని చెల్లాచెదురు చేస్తున్నాయని అంటున్నారు. చీకటిలో గుట్టలు కనిపించక వాహనచోదకులు పడిపోతున్నారని అంటున్నారు. సమస్యపై కార్యదర్శి రాధాకృష్ణను వివరణ కోరగా పూడికలు తీయించి శుభ్రం చేయిస్తామని తెలిపారు. హెల్త్‌క్లీనిక్ వద్ద చెత్త తొలగిస్తామన్నారు.


రోడ్డుపై ఉన్న పూడికలు

న్యూస్‌టుడే, రాజానగరం

సూక్ష్మ సేద్యం పథకానికి కూటమి ప్రభుత్వం తిరిగి జీవం పోసింది. బిందు, తుంపర సాగుకు అవసరమైన పరికరాలను 45 నుంచి 95 శాతం వరకు రాయితీపై అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే రైతుల నుంచి వివరాల నమోదుకు శ్రీకారం చుట్టింది. 2014-19 మధ్య కాలంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సూక్ష్మ సేద్యానికి పెద్ద పీట వేశారు. కర్షకులనూ అదే రీతిలో ప్రోత్సహించారు. దాంతో అప్పట్లో చాలా మంది రైతులు సూక్ష్మ సేద్యం వైపు మొగ్గు చూపారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ పథకాన్ని పట్టించుకోకపోవడంతో కునారిల్లింది. సంబంధిత కంపెనీలకు బకాయిలు చెల్లించకపోవడంతో అవీ ఆసక్తి కనబరచలేదన్నది బహిరంగరహస్యం.

సూక్ష్మానికి మోక్షం!

● బిందు, తుంపర సేద్య పరికరాలపై ప్రభుత్వం దృష్టి ● రాయితీలను పునరుద్ధరించేందుకు సన్నాహాలు

ఇదీ పరిస్థితి

జిల్లాలో ఈ పథకం అమలుకు 9వేల హెక్టార్లు లక్ష్యంగా నిర్దేశించారు. నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో అమలు సన్నాహాలు జరుగుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఇది నాలుగు రెట్లు అధికం. అర్హులైన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, వివరాలతో సమీపంలోని రైతు సేవా కేంద్రాలలో వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏను సంప్రదించి బయోమెట్రిక్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకునేలా వీలు కల్పించారు. సంబంధిత అధికారులు సచివాలయాల ద్వారా వివరాల నమోదు చేపడుతున్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో వ్యవసాయశాఖకు నిధులు కేటాయించడంతో పాటు రైతులకు వెంటనే రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలని ఆదేశాలు రావడంతో ఈ పథకానికి జవసత్వాలు సమకూరినట్లయింది. పరికరాల సరఫరా నిమిత్తం 12 కంపెనీలను ప్రభుత్వం ఎంపిక చేసింది.

లక్ష్యం.. వెయ్యి హెక్టార్లు..

రాజానగరం నియోజకవర్గంలో వెయ్యి హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం లక్ష్యంగా నిర్ణయించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి..

మండలం	సాగు లక్ష్యం (హెక్టార్లలో)	రైతులు	వచ్చిన దరఖాస్తులు (హెక్టార్లకు)
రాజానగరం	600	184	517
కోరుకొండ	300	189	187
సీతానగరం	100	85	91


బిందు సేద్యం పద్ధతి

రాయితీ నిబంధనలు ఇలా...

● సూక్ష్మ సేద్యంలో 2 హెక్టార్ల లోపు ఉన్న రైతులకు 90 శాతం రాయితీ రూ.2.18 లక్షల వరకు వర్తిస్తుంది. ● 2-5 హెక్టార్లకు ఉన్న వారికి 50 శాతం రాయితీ, రూ.3.10 లక్షలు లభిస్తుంది. సేద్య పరికరాలు అందించనున్నారు. ● తుంపర్ల సేద్యంలో అయితే 2 హెక్టార్ల వరకు 55 శాతం, 5 హెక్టార్లు ఉన్న రైతులకు 45 శాతం రాయితీపై పరికరాలు మంజూరు చేయనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం రాయితీపై సూక్ష్మ పరికరాలు అందించేందుకు ముందుకొచ్చింది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా సాగు జలాలను సంరక్షించుకోవడంతో పాటు, ఖర్చునూ తగ్గించుకోవచ్చు. ఏపీఎంఐపీ పీడీ కార్యాలయంలో సంప్రదిస్తే మరిన్ని వివరాలు తెలుస్తాయి.

- ఎ.దుర్గేష్, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఏపీఎంఐపీ

సినిమాలు

దానవాయిపేట (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: శ్యామల, ఊర్వశి: **వేట్టయన్**, రాజా: **మార్టిన్**, కుమారి, సూర్యప్యాలస్, అప్సర: **దేవర**, శివజ్యోతి, అశోక: **విశ్వం**, స్వామి: **స్వాగ్**, అనుశ్రీ: **జనక అయితే గనక**, సూర్యమినీ: **జిగ్రా**, రంభ: **మానాన్న సూపర్ హీరో**, మేనక: **సత్యం సుందరం**, **మార్టిన్**, (రెండేసి ఆటలు), వీఎస్ మహల్: **వేట్టయన్**, **దేవర** (రెండేసి ఆటలు)

అభివృద్ధికి సహకారం అందిస్తాం

కడియం: మండల అభివృద్ధికి సహకారం అందిస్తామని జనసేన నాయకులు ముద్రగడ జమ్మి, చిరుకూరి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాలు మరింత అభివృద్ధిపథంలో ముందుకు సాగేందుకు జనసేన పార్టీ తరపున సహకారం అందిస్తామన్నారు. పార్టీ నాయకులు దామిరెడ్డి నాగరాజు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా పల్లెపండగ

రాజానగరం, న్యూస్‌టుడే: అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన తెదేపా రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి, భాజపా సీనియర్ నాయకుడు నీరుకొండ వీరన్నచౌదరితో కలిసి పలు అభివృద్ధి శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సీతారాంపురం, కలవచర్ల, పాతతుంగపాడు, కొత్తతుంగపాడు, చక్రద్వారబంధం తదితర గ్రామాల్లో వారు పర్యటించారు. రూ.17 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశామని ఎమ్మెల్యే తెలిపారు. కూటమి నాయకులు గంగిశెట్టి చంటిబాబు, చిట్టిప్రోలు పద్దరాజు, నూనె వెంకన్న, రామిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బత్తులకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

సమస్యలన్నీ పరిష్కరిస్తాం..

బొమ్మూరు: పల్లెపండుగతో గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపిస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. పిడింగొయ్యిలో రూ.3 కోట్లతో అంతర్గత రోడ్లు, కాలువలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తెదేపా నాయకులు మార్నివాసుదేవరావు, మండల అధ్యక్షుడు మత్శేటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే మన ప్రభుత్వ లక్ష్యమన్నారు. మజ్జి పద్మ, ఏపీఓ సత్యవతి, పశుసంవర్ధకశాఖ అధికారులు గ్రామంలో పనుల వివరాలు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. శాటిలైట్‌సిటీలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

హుకుంపేట: 13,326 పంచాయతీలకు గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి పనులకు తీర్మానం చేయడం చారిత్రాత్మక విషయమని గోరంట్ల అన్నారు. పలు అభివృద్ధి పనుల్లో ఆయన పాల్గొన్నారు.


శాటిలైట్‌సిటీలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

గ్రామాల ప్రగతికి పెద్దపీట

గోకవరం, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూనే గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. పల్లెపండుగ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో ప్రథమంగా గోకవరం మండలం కామరాజుపేటలో సోమవారం వీరు ప్రారంభించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్‌తో కలిసి కామరాజుపేట గ్రామంలో రూ.80 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తుమ్మలపల్లి రమేష్ గోకవరంలో రూ.2.50 కోట్లతో, కొత్తపల్లిలో రూ.50 లక్షలతో, కృష్ణునిపాలెంలో రూ.60 లక్షలతో, మల్లవరంలో రూ.40 లక్షలతో సీసీరోడ్, డ్రైనేజీ నిర్మాణాలకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


కామరాజుపేటలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తదితరులు


పీరారామచంద్రపురంలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పల్లె పండుగకు తొలిఅడుగు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు, మెల్లూరు, ఆరికిరేవుల గ్రామాల్లో సోమవారం జరిగిన పల్లెపండుగ కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరై భూమిపూజ చేశారు. మూడు గ్రామాలకు కలిపి రూ.80.53 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు.

అనపర్తి గ్రామీణం: పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా అనపర్తి మండలం దుప్పలపూడి, పీరారామచంద్రపురం, లక్ష్మీనరసాపురం గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నల్లమిల్లి భూమి పూజ చేశారు.

మధురం.. సాయి పుణ్యతిథి ఉత్సవం

కోరుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీ శిర్డీ సాయినాధుని ఆలయాల్లో బాబా పుణ్యతిథి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక ద్వారకాసాయినగర్, పెట్రోల్ బంక్ సెంటర్‌లోని సాయి మందిరం, బూరుగుపూడి ద్వారక శిర్డీసాయి బాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ద్వారకాసాయినగర్ ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. సప్తాహ గురులీ అర్చన, పెద్దఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. బూరుగుపూడి ద్వారక శిర్డీసాయి బాబా ఆలయంలో సాయిరాం పాఠశాల విద్యార్థులు చేసిన సీతారాముల కల్యాణం ఆద్యంతం అలరించింది. పెట్రోల్ బంక్ సమీపంలోని సాయి ఆలయంలో సాయి సత్యవ్రతాలు వైభవంగా జరిగాయి.


సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

17న వాల్మీకి జయంతి వేడుకలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రసంగ తరంగిణి సాహిత్య సభలో భాగంగా ఈనెల 17న వాల్మీకి జయంతి వేడుక నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు కె.సత్యనారాయణమూర్తి తెలిపారు. గురువారం ఉదయం 10గంటలకు ఆదిత్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో జరిగే కార్యక్రమంలో 'వాల్మీకి కవిత్వ సౌందర్యం' అనే అంశంపై ప్రసంగం ఉంటుందని చెప్పారు.

పొంచి ఉన్న ప్రమాదం.. జర జాగ్రత్త..!

రంగంపేట: ఈలకొలనులో రోడ్డు పక్కనే పంచాయతీ సేకరించిన చెత్తను వేస్తున్నారు. చెత్త కుప్పలుగా దర్శనిమిస్తున్నపుడు నిప్పు పెట్టడంతో ఈ పరిసరాల్లో పొగ కమ్ముకుంటుంది. రాజానగరం నుంచి ఈలకొలను మీదుగానే బలభద్రపురానికి రోజూ వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ పొగతో ప్రయాణం ప్రమాదకరంగా సాగింది. ఎదుటి వాహనం దగ్గరకు వచ్చేంత వరకు గుర్తించలేని పరిస్థితి. తగు జాగ్రత్తలు తీసుకుని పంచాయతీ సిబ్బంది చెత్తకు నిప్పు పెట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.



ఫ్లాష్.. ఫ్లాష్ మోరంపూడి సమీపంలో రోడ్డు ప్రమాదం ఒకరికి తీవ్ర గాయాలు

దానవాయిపేట, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం గ్రామీణం మోరంపూడిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో మోరంపూడి కూడలి నుంచి నామవరం వైపు అతివేగంగా వెళ్తున్న ఓ కారు మార్గంలో ఓ సిమెంట్ దిమ్మ, తర్వాత స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఢీకొంది. అదే వేగంతో కాంక్రీట్ కలిపే యంత్రాన్ని ఢీకొని పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదం జరిగే సమయంలో కారులో నలుగురు వ్యక్తులున్నారు. వీరిలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమైంది. ఘటనా స్థలానికి చేరుకున్న బొమ్మూరు పోలీసులు విచారణ చేపట్టారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.


ప్రమాదంలో ధ్వంసమైన కారు


ఆసుపత్రికి బాధితుడి తరలింపు


ఆభరణాన్ని బహూకరిస్తున్న దాతలు

అమ్మవారికి బంగారు ఆభరణం వితరణ

రాజానగరం, న్యూస్‌టుడే: మండలంలోని చక్రద్వారబంధం పరిధి దేవీచౌక్ వద్ద నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కనకదుర్గమ్మ వారికి రూ.1.20 లక్షల విలువైన బంగారు ఆభరణాన్ని(నెక్లెస్‌ను) ప్రగడ అప్పారావు కుమారులు రమణ, సూరిబాబు సోమవారం ఆలయ కమిటీకి బహూకరించారు. మంగళవారం అమ్మవారికి బోనాలను సమర్పించనున్నట్లు కమిటీ వారు తెలిపారు.

మద్యం విధానాలతో ఇబ్బందులు

బొమ్మూరు, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం నెరవేర్చడం లేదని మాజీ మంత్రి వేణు అన్నారు. బొమ్మూరు వైకాపా కార్యాలయంలో ప్రతికా సమావేశం సోమవారం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మద్యం పాలసీ విధానం ద్వారా తెదేపా ఎమ్మెల్యేలు, నాయకులు లబ్ధి పొందనున్నారని విమర్శించారు. 3,396 షాపులకు సుమారు రూ.1700 కోట్ల ఆదాయం వస్తే దాన్ని సిండికేట్లు దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గతంలో నిల్వ చేసిన 80 లక్షల టన్నుల ఇసుకను ప్రభుత్వం వచ్చిన వెంటనే యథేచ్ఛగా దోపిడీ చేశారన్నారు. కాకినాడ, జగ్గంపేట, లాలాచెరువు, వేమగిరి, రావులపాలెంలో ఇసుక దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇసుక, మద్యం పాలసీ వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు నక్కా రాజబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, మాజీ నెప్‌కేప్ డైరెక్టర్ సత్యప్రియ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి తీవ్రగాయాలు

సీతానగరం: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వృద్ధుడు తీవ్రగాయాలపాలయ్యాడు. పోలీసుల వివరాలు ప్రకారం.. కాటవరం గ్రామానికి చెందిన మేకల వెంకటరావు సోమవారం గ్రామంలో బస్టాండు వద్ద నిలబడి ఉండగా రాజమహేంద్రవరం వైపు నుంచి సీతానగరం వైపు వేగంగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో తీవ్రగాయాలపాలైన వెంకటరావును రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపారు.

గండేపల్లిలో దంపతులకు..

గండేపల్లి: ఎన్‌హెచ్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాలివీ.. ధవళేశ్వరానికి చెందిన భార్యాభర్తలు ద్విచక్రవాహనంపై పిఠాపురం ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా తాళ్లూరు దాబాల సెంటర్‌కు వచ్చేసరికి అదే సమయంలో ఉప్పలపాడు రోడ్డు వైపు స్కూటీపై రోడ్డు దాటుతున్న వ్యక్తి వీరి వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో దంపతులకు గాయాలవ్వడంతో వీరిని జగ్గంపేట సీహెచ్‌సీకి అంబులెన్స్‌లో తరలించినట్లు తెలిపారు.

బాధితుడికి న్యాయం చేయాలని నిరసన

గోకవరం, న్యూస్‌టుడే: గోకవరం గ్రామానికి చెందిన దళిత యువకుడికి న్యాయం చేయాలని దళిత నాయకుడు వరసాల ప్రసాద్ డిమాండ్ చేశారు. తంటికొండ జంక్షన్ వద్ద ఉన్న ఆర్చి వద్ద సోమవారం పలువురు దళితులతో కలిసి ఆయన నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా వరసాల మాట్లాడుతూ.. గోకవరం గ్రామానికి చెందిన కార్తికేయ అనే దళిత యువకుడు ఏఎంఆర్ మైనింగ్ సీనరీస్ అనే కాంట్రాక్ట్ సంస్థలో పనిచేసేవాడన్నారు. గత మేలో విధి నిర్వహణలో ఉన్న కార్తికేయ రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై చికిత్స పొందాడన్నారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు సంస్థ ప్రతినిధులు ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సంస్థ తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


గోకవరంలో నిరసన చేపట్టిన దళితులు

పుట్టగొడుగుల పెంపకంతో ఆదాయ మార్గాలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ ఏడాది విద్యార్థినులు మిల్కీ పుట్టగొడుగుల పెంపకం సాగించి వాటి అమ్మకాలు మొదలు పెట్టారు. వృక్ష శాస్త్ర విభాగం పర్యవేక్షణలో సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన పుట్టగొడుగుల అమ్మకాన్ని ప్రిన్సిపల్ రాఘవ కుమారి ప్రారంభించారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉత్పత్తి చేసే వీటికి డిమాండ్ ఎక్కువగా ఉందని, తద్వారా ఆదాయ మార్గాలను పెంపొందించుకోవచ్చన్నారు. వృక్ష శాస్త్ర విభాగాధిపతి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ బలోపేతానికి కృషి

రాజానగరం, న్యూస్‌టుడే: గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ కోరారు. రాజానగరంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులుతో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, మండల, వార్డు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని, పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసే వారిని గుర్తించి ఆయా కమిటీలలో నియమించాలని సూచించారు. పార్టీ నాయకులు వై.ఎ.వడయార్, ముప్పిడి శ్రీనివాస్, అడుసుమిల్లి రమేష్, ఎ.ఏడుకొండలు, జి.శ్రీధర్, పి.గణేష్, రంగా శ్రీనివాస్, డా.శ్రీనివాస్, వంశీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మార్టిన్ లూథర్

19 నుంచి ఎస్‌జీఎఫ్ రైఫిల్ షూటింగ్ పోటీలు

రాజానగరం, న్యూస్‌టుడే: మండలంలోని సంపతనగరంలో గల రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల 19వ తేదీ నుంచి 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ రైఫిల్ షూటింగ్ పోటీలు నిర్వహించనున్నామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) కార్యదర్శి ఎస్.ఆర్.కోవిస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలురు, బాలికలకు అండర్- 14, 17 విభాగాల్లో ఈ పోటీలు ఈ నెల 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, డీఎస్ఓ కె.వాసుదేవరావు, మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తదితరులు హాజరవుతారని అన్నారు.

అలరించిన కళాకృతులు

గైట్ కళాశాలలో నిర్వహించిన ఎన్‌సీసీ ప్రత్యేక జాతీయ సేవా శిబిరం అట్టహాసంగా ముగిసింది. ఈ సందర్భంగా సోమవారం ఎన్‌సీసీ క్యాడెట్లు నిరుపయోగ వస్తువులతో అలంకరణ వస్తువులు తయారు చేశారు. ఆ కళాకృతులను ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. సుందరమైన ఆ ఆకృతులు చూపరులను ఆకట్టుకున్నాయి. తమ రాష్ట్రాలకు చెందిన సంస్కృతిని ప్రతిబింబించేలా నయనానందకరంగా తయారు చేసిన విద్యార్థులను పలువురు అభినందించారు. **- న్యూస్‌టుడే, రాజానగరం**



ఎన్‌సీసీ క్యాడెట్లు రూపొందించిన కళాకృతి

వైకాపా పాపం.. స్వచ్ఛతకు శాపం

సీతానగరం, న్యూస్‌టుడే: అటు పల్లెల్లో స్వచ్ఛత ఇటు యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో అప్పటి తెదేపా ప్రభుత్వం అమలుచేసిన స్వచ్ఛ సంకల్పాన్ని గత వైకాపా ప్రభుత్వం నీరుగార్చింది. చెత్త తరలించే వాహనాల పట్టింపు విస్మరించి పథకాన్ని పూర్తిగా అటకెక్కించింది. దీంతో రూ.లక్షలు విలువైన వాహనాలు తుప్పుపట్టి ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద మూలన దర్శనమిస్తున్నాయి. ఈ కారణంగా ఎస్సీ యువత ఉపాధి అవకాశాలనూ కోల్పోయింది. గత తెదేపాలో నిర్మాణం చేసిన సంపద సృష్టి కేంద్రాలను మూసివేసిన వైకాపా ఆ కేంద్రాల్లోకి చెత్తను సేకరించడానికి వాహనాలు, రిక్షాలు అందించడం గమనార్హం. సీతానగరం మండలంలోని రఘుదేవపురం పంచాయతీకి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించే రూ.8 లక్షల విలువైన వాహనంతో పాటు ఆరు రిక్షాలను ఇచ్చింది. నాలుగేళ్ల కిందట అప్పటి ప్రజాప్రతినిధులు ఎంతో అట్టహాసంగా వీటిని ప్రారంభించారు. తర్వాత ఒక్క రోజు కూడా వీటిని బయటకు తీయలేదు. గ్రామ పంచాయతీల్లో ఉన్న నిధులన్నీ అప్పటి ప్రభుత్వమే తీసుకోవడంతో ఇచ్చిన వాహనానికి ఇంధనం, చోదకుడు, సిబ్బంది వేతనాలు భరించే పరిస్థితుల్లో లేమంటూ వాహనాలను పక్కన పెట్టేశారు. పలు పంచాయతీల్లో ఇవన్నీ నిరుపయోగంగా మారిపోయి పనికిరాకుండా మారాయంటున్నారు. సంపద సృష్టి కేంద్రాలను తెరిపించడంతో పాటు వాహనాలు బయటకు తీయిస్తామని ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి తెలిపారు.


రాపాకలో నిరుపయోగంగా వాహనం

బొమ్మూరు: స్థానిక పంచాయతీ ఆవరణలో స్వచ్ఛ శుభ్రతా రిక్షాలు మూలకు చేరాయి. కొంతకాలంగా వీటిని ఉపయోగించకపోవడం వల్ల పూర్తిగా తుప్పుపట్టాయి. ప్రతీ పంచాయతీలో టైర్లు ఒంగిపోయి, తుప్పు పట్టిన వాటిని అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజాధనం ఈ విధంగా దుర్వినియోగం అవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై కార్యదర్శి కాశీని వివరణ కోరగా రిక్షాల వినియోగంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.


బొమ్మూరు పంచాయతీలో రిక్షాల పరిస్థితి

ధవళేశ్వరం: స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పూర్తిగా నీరుకారుతోంది. ఇళ్లలో తడి, పొడి చెత్తను తీసుకెళ్లేందుకు అందజేసిన రిక్షాలను నిరుపయోగంగా మూలన పడేయడంతో అవి తుప్పుపడుతున్నాయి. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి వెంకటరావును వివరణ కోరగా పరిశీలించి వినియోగంలోకి తీసుకోస్తామని తెలిపారు.

వేధింపులపై కేసు నమోదు

సీతానగరం: భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నానికి చెందిన పనమాల చిన్నబాబుకు 13 ఏళ్ల కిందట విజయవాడకు చెందిన లక్ష్మీదుర్గాతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా భర్త చిన్నబాబు లక్ష్మీదుర్గను తరుచూ వేధింపులకు గురిచేయడంతో ఆమె మహిళా మండలి సమక్షంలో సమస్యను తెలిపారు. అయినా భర్తలో మార్పు రాకపోవడంతో అతనిపై సోమవారం కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చంద్రయ్య విగ్రహాల ఏర్పాటుకు వినతి

దేవరపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను గోపాలపురం నియోజకవర్గ జనసేన నాయకులు సోమవారం రాజమహేంద్రవరంలో కలుసుకున్నారు. పార్టీకి సంబంధించి పలు అంశాలను చర్చించారు. అనంతరం స్వాతంత్య్ర సమరయోధుడు ద్వారబంధాల చంద్రయ్య జీవిత చరిత్ర పుస్తకాన్ని మంత్రికి అందజేశారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు కంటే ముందే చంద్రయ్య స్వాతంత్య్ర సమరం మొదలు పెట్టారని, ఆయన జీవిత చరిత్ర ప్రజలకు తెలిసే విధంగా పలు చోట్ల విగ్రహాలు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో దేవరెడ్డి బలరాం నాయుడు, మద్ది అనిశెట్టి, కరుట్లి శ్రీను, చిలుకూరి పణి ఉన్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

అల్పపీడన ప్రభావంతో వర్షం

తాళ్లపూడి: అల్పపీడన ప్రభావంతో తాళ్లపూడి మండలంలో సోమవారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన జల్లులకు రహదారులు బురదమయంగా మారాయి. రోడ్లపై గుంతల్లో నీరు చేరడంతో రాకపోకలు సాగించే వాహనచోదకులు పలు ఇబ్బందులు పడ్డారు. వరి కోతలను నిలుపుదల చేయించారు.

మహా కుంభాభిషేక మహోత్సవాలు

తాళ్లపూడి: తాళ్లపూడిలోని నవదుర్గాదేవి ఆలయంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు మహాకుంభాభిషేకం, శతచండీయాగ మహోత్సవాలు జరుగుతున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 21న పూజలు, హోమాలు, చండీపారాయణం, 22న 108 దంపతులచే శతచండీహోమం, గరికపాటి నరసింహారావు ప్రవచన కార్యక్రమం, 23న దుర్గామల్లేశ్వరస్వామి శాంతి కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అమ్మవారి రథోత్సవం జరుగుతుందన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఉండ్రాజవరం: ఇటీవల మండల పరిషత్తు సమావేశంలో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సక్రమంగా ఉండటం లేదని సర్పంచులు వర్గించడంతో అధికారులు తాడిపర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణను సోమవారం పరిశీలించారు. సర్పంచి కరుటూరి నరేంద్ర బాబు, తహసీల్దార్ పీఎస్ఎస్ ప్రసాద్, ఎంపీడీవో వి.రామారావు, ఈవోపీఆర్డీ అంజనేయులు, ఎంఈవో పోలు శ్రీనివాస్, సర్పంచులు తదితరులు భోజన సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు.

నేషనల్ బెస్ట్ సిటిజన్ అవార్డుకు పాండు ఎంపిక

నిడదవోలు, న్యూస్‌టుడే: తెలుగు సాంస్కృతిక వికాస సంస్థ-2024 ఉత్తమ జాతీయ పురస్కారానికి తాడిమళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు డాక్టర్ విప్పర్తి ఐజాక్ న్యూటన్‌పాండు ఎంపికైనట్లు సంస్థ జాతీయ కన్వీనర్ డాక్టర్ గణగళ్ళ విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న విజయవాడలో అవార్డు ప్రదానం చేస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా



సమస్య: నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో ఇంటిపై నుంచి విద్యుత్తు తీగలు ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్య పరిష్కారం కాలేదు. జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణ మధ్యలో విద్యుత్తు స్తంభం ఉంది. వీటిని మార్చు చేయాలి. - ఓబయ్య, సమిశ్రగూడెం

సమాధానం: గతంలో ఈ సమస్య మా దృష్టికి వచ్చింది. పంచాయతీ, మండల పరిషత్ ద్వారా నిధులు ఇచ్చిన లేక ఇబ్బందులు పడుతున్న వారు విద్యుత్తుశాఖకు ఛార్జీలు చెల్లించిన మార్పు చేసేందుకు అవకాశం ఉంది. - రమేష్, ఏఈ ఇంజినీర్, పురుషోత్తపల్లి సబ్‌స్టేషన్

సమస్య: ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో డ్రెయిన్ వ్యర్థాలతో పూడుకుపోయింది. మురుగు కదలడం లేదు. దుర్వాసన వస్తోంది. రాత్రి వేళల్లో దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికుడు, తాళ్లపూడి

సమాధానం: డ్రెయిన్‌ను పరిశీలించి శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. - వీరన్న, పంచాయతీ కార్యదర్శి

- న్యూస్‌టుడే, నిడదవోలు, తాళ్లపూడి

ఏటిగట్టు రహదారి శుభ్రం...

స్పందనకు వందనం



తాళ్లపూడిలోని సినిమా హాల్ సెంటర్ ర్యాంపు రహదారిని శుభ్రం చేశారు. ఇది చెత్త, చెదారాలు, వ్యర్థాలతో అధ్వానంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై ఈ నెల 10న 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ప్రచురితమైన సమస్యపై పంచాయతీ కార్యదర్శి వీరన్న స్పందించి రహదారిని శుభ్రం చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, తాళ్లపూడి

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497 నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

పల్లె ప్రగతికి బాటలు..!

పండగ పేరిట అభివృద్ధి పనులకు శ్రీకారం

తాళ్లపూడి, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో నిర్లక్ష్యంతో అయిదేళ్లపాటు పల్లెల్లో అభివృద్ధి పడకేసింది. కేంద్రం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను సైతం దారిమళ్లించి పంచాయతీలను నిర్వీర్యం చేశారు. దీని వల్ల గ్రామాల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి చందంగా మారాయి. ఈ పరిస్థితులను గమనించిన కూటమి ప్రభుత్వం పల్లెలను ప్రగతి బాటలో నడిపించేందుకు నడుం బిగించింది. పల్లె పండగ పేరిట గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. సోమవారం నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న వారోత్సవాల్లో పనులు చేపట్టింది. ఆయా పనులకు పరిపాలన ఆమోదం తెలపడంతో గ్రామాల్లో భూమిపూజ కార్యక్రమాలు సందడిగా మొదలయ్యాయి. ఇందులో భాగంగా కొవ్వూరు నియోజకవర్గంలోని తాళ్లపూడి మండలం గజ్జరం నుంచి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఎంపిక చేసిన పనులను సోమవారం శంకుస్థాపనలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా రహదారులు, మురుగుకాల్వల నిర్మాణం, ఇతర వసతులు కల్పించనున్నారు. ఉపాధిహామీ పథకం నిధులతో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టనున్నారు. వచ్చే ఏడాది జనవరి నాటికి అన్నీ పనులు పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

మారనున్న రూపురేఖలు..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే పల్లెల అభివృద్ధిపై దృష్టిసారించింది. ఇటీవల గ్రామస్థాయిలో జరిగిన సభల్లో ప్రజలు లేవనెత్తిన సమస్యలను ఆధారంగా పనులను ఎంపిక చేశారు. రహదారులు, మురుగు పారుదల వ్యవస్థపై ఎక్కువ నిధులు వెచ్చించనున్నారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వీటిని డిసెంబరు నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని అధికారులు చెబుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో డ్రెయిన్ల నిర్మాణం చేపట్టనున్నారు. దీనికి సంబంధించి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

పంచాయతీరాజ్ రహదారుల నిర్మాణానికి..

మండలం	పంచాయతీలు	పనులు	నిధులు (రూ.లక్షల్లో)
తాళ్లపూడి	11	22	221
చాగల్లు	13	13	85
కొవ్వూరు	16	16	223



తాళ్లపూడి: ఎస్సీ ఏరియాలో డ్రెయిన్ లేక పిచ్చిమొక్కలతో ఇలా..

త్వరితగతిన చేపట్టాలి..

గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రహదారులు త్వరితగతిన చేపట్టాలి. ఈ మేరకు ప్రాధాన్యక్రమంలో పనులు చేపడుతున్నాం. డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది.

- శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈ, కొవ్వూరు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

కేంద్రం సహకారంతో పల్లెల అభివృద్ధి

తాళ్లపూడి, న్యూస్‌టుడే: గ్రామీణాభివృద్ధికి ఎన్డీఏ కూటమి కృషి చేస్తోందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. తాళ్లపూడి మండలంలోని గజ్జరం గ్రామంలో పల్లెపండగ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. గ్రామంలో చేపట్టనున్న పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పల్లెలను అభివృద్ధి చేస్తామన్నారు. తొందరలోనే ఈ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేయడం జరుగుతుందన్నారు. దీపావళికి గ్యాస్ సిలిండర్లు, సంక్రాంతికి కొత్త రేషన్‌కార్డులు జారీ చేయడం జరుగుతుందన్నారు. త్వరలో అన్నీ గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రాంబాబు, నాయకులు, కాకర్ల వంశీ, దండమూడి శేషు, ఓలేటి హరిరామ కృష్ణ, మల్లిపూడి బాపూజీరావు, పూలపర్తి బాలకృష్ణ, లింగాచారి పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం



నూతన కార్యవర్గ సభ్యులతో ఎమ్మెల్యే వెంకటరాజు

నల్లజర్ల, న్యూస్‌టుడే: మహిళా సాధికారతే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. నల్లజర్ల ప్రధాన కూడలి సమీపంలో ప్రగతి అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఇలాంటి శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి గ్రామంలో ఈ శిక్షణ శిబిరాలు నెలకొల్పి మహిళలకు చేయూతనివ్వాలన్నారు. అనతరం పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా చీమకుర్తి కృష్ణప్రసాద్, మండలశాఖ అధ్యక్షుడిగా మహ్మద్ షరీఫ్, జి.వి.వి.ప్రసాద్, కూరపాటి నాగరాజు తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సింహాద్రిరావు, సర్పంచి పల్లి జ్యోతి, ప్రగతి అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ జాతీయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రహదారికి మరమ్మతులు



పనులు పరిశీలిస్తున్న శేషారావు, శ్రీనివాసు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: మండలంలోని వేలివెన్ను నుంచి కాల్దరి వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో వేలివెన్ను గ్రామ దత్తత స్వీకర్త బూరుగుపల్లి శ్రీనివాసు ఆధ్వర్యంలో సొంత నిధులతో మరమ్మతు పనులు చేయిస్తున్నారు. వీటిని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు తదితరులు సోమవారం పరిశీలించారు. ఈ పనులతో రాకపోకలకు ఇబ్బందులు తొలగనున్నాయని పరిసర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ సభల నిర్వహణ

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: మండలంలోని ఉండ్రాజవరం, మోర్త, దమ్మెన్ను తదితర గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల ఎంపికపై గ్రామసభలు సోమవారం నిర్వహించారు. పూర్తి చేసిన పనులు, చేపట్టాల్సిన పనులను ఎంపిక చేశారు. సర్పంచి గురజాల సత్యనారాయణ, ఏపీవో సత్యనారాయణ, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ముప్పిడి పరామర్శ

చాగల్లు, న్యూస్‌టుడే: కలవలపల్లి గ్రామ తెదేపా అధ్యక్షుడు అబ్బూరి సీతారామాంజనేయులు తల్లి అన్నపూర్ణమ్మ(93) ఇటీవల మృతి చెందారు. సోమవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్నపూర్ణమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఇటీవల మృతి చెందిన పి.సురేంద్ర కుటుంబానికి ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నాయకులు ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్, సూరపనేని చిన్ని తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

బాల్య వివాహాలు చట్టవిరుద్ధం

చాగల్లు, కొవ్వూరు పట్టణం: బాల్య వివాహాలను ప్రోత్సహించడం, నిర్వహించడం చట్ట వ్యతిరేకమని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని కొవ్వూరు తహసీల్దార్ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం బాల్య వివాహాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విభాగినిని ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్ బస్సు



నల్లజర్ల: మండలంలోని అనంతపల్లి శివారులో జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున ప్రైవేటు టావెల్ బస్సు విభాగినిని ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 27 మంది భవానీ మాలధారులు సురక్షితంగా బయటపడ్డారు. అనకాపల్లి నుంచి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న హైవే పోలీసులు వారందరిని వేరే బస్సులో విజయవాడకు పంపించారు.

పట్టపగలు ఆభరణాల చోరీ

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగిలో తాళం వేసిన ఇంట్లో పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. పాలంగికి చెందిన వేపు దుర్గాసాయికిశోర్, భార్య తణుకులో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఇంటికి తాళం వేసి తణుకు వెళ్లారు. సాయంత్రం 4.30 గంటలకు తిరిగొచ్చే సరికి కిటికీ తలుపులు పగులగొట్టి ఉన్నట్లు గుర్తించారు. లోపలున్న బీరువా కూడా పగులగొట్టి ఉంది. అందులోని సుమారు 8 కాసుల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.







తాడిపర్రులో కనకదుర్గమ్మ ఊరేగింపు | పల్లంట్లలో అలంకరించిన వాహనంపై.. | చాగల్లులో..

ముగిసిన దసరా వేడుకలు

చాగల్లు, కొవ్వూరు పట్టణం, దేవరపల్లి, ఉండ్రాజవరం న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ముగింపు వేడుకల్లో భాగంగా కొవ్వూరు పట్టణం, చాగల్లు, మండల గ్రామాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. పలుచోట్ల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధనలు నిర్వహించారు. ప్రత్యేకంగా ముస్తాబు చేసిన అమ్మవారి రథంలో ఉత్సవ మూర్తి ఊరేగింపు వైభవంగా నిర్వహించి గోదావరి, స్థానిక కాలువల్లో నిమజ్జనం చేశారు. ● దేవరపల్లి మండలంలోని పల్లంట్ల, దేవరపల్లిలో శ్రీరాజరాజేశ్వరి సమేత దుర్గ మల్లేశ్వర స్వామి ఆలయం, శ్రీబాల దుర్గమ్మ అమ్మవార్లు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగించారు. ● తాడిపర్రు, చివటం తదితర గ్రామాల్లో కనకదుర్గమ్మతల్లి ఊరేగింపులు నిర్వహించారు. ఆసాదుల, బేతాల నృత్యాలు, వివిధ వేషధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి.

పట్టభద్రులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

నల్లజర్ల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక దృష్ట్యా 2021 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారంతా ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాటి చిరంజీవిరావు పేర్కొన్నారు. సోమవారం నల్లజర్ల తెదేపా కార్యాలయంలో పట్టభద్రుల ఓట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవిరావు మాట్లాడుతూ 2025 మార్చి నెలలో గుంటూరు, కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతున్నాయన్నారు. పట్టభద్రుల ఎన్నిక సమయం తక్కువ ఉంది కాబట్టి ఎన్డీఏ కూటమి నాయకులంతా ఓటర్లను గుర్తించి నమోదు చేయించాలన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, పేరబత్తుల రాజశేఖర్, లంకా సత్యనారాయణ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు రెండు దరఖాస్తులు

చాగల్లు, న్యూస్‌టుడే: కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు దరఖాస్తులు అందినట్లు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. కొవ్వూరు మండలం దొమ్మేరుకు చెందిన ఎ.గంగమ్మ పింఛను ఇప్పించాలని, ధర్మవరానికి చెందిన కె.చిట్టిబాబు తన స్థలాన్ని 22-ఏ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ దరఖాస్తులు అందించారు.

మంత్రి పర్యటన సమాచారమూ చెప్పట్లేదు

కంసాలిపాలెంలో జనసేన నాయకుల తీరుపై తెదేపా శ్రేణుల ఆగ్రహం

నిడదవోలు, న్యూస్‌టుడే: అయిదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం.. ఇప్పుడు అధికారంలో ఉన్నా కనీస గుర్తింపునకు నోచుకోలేదని కంసాలిపాలెం తెదేపా నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పల్లె పండగ - పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా రూ.30 లక్షలతో ఆరు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ సోమవారం ఇక్కడికి విచ్చేశారు. ఆయన సమక్షంలోనే తెదేపా, జనసేన నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మంత్రి వస్తున్న సమాచారాన్ని తమకు చెప్పాల్సిన అవసరం లేదా? అని తెదేపా నాయకులు ప్రశ్నించారు. గ్రామంలోని జనసేన నాయకులు వైకాపా వారితో అంటకాగుతున్నారని, మంత్రి కార్యక్రమం ఈనెల 12నే ఖరారైనా ఆ విషయం తమకు చెప్పకుండా వైకాపా నాయకులతో సంప్రదింపులు చేస్తున్నారంటూ మంత్రి ఎదుటే తెదేపా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి అభ్యర్థి గెలుపు కోసం తామంతా అహర్నిశలు శ్రమించామని, తీరా ఇప్పుడు మా గ్రామ సమస్యలపై మాట్లాడుతుంటే విమర్శిస్తున్నారన్నారు. ఇక్కడ కూటమి అంటే తెదేపా, జనసేన, భాజపానా? లేక జనసేన, వైకాపానా అన్నది తేల్చాలని నిలదీయడంతో ఒకరినొకరు గెంటుకునే వరకు వెళ్లింది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేయడంతోపాటు, మంత్రి దుర్గేష్ సర్దిచెప్పే ప్రయత్నం చేసి శంకుస్థాపన కార్యక్రమాలు కొనసాగించడంతో వివాదం సద్దుమణిగింది.



సర్దిచెబుతున్న మంత్రి దుర్గేష్